

"ఒసే కుంటీ ... ఒసేయ్ నిన్నే నే పలకవేమే?" అని రంగమ్మ బావి దగ్గర నీళ్లు చేదుతూ సుగుణను పిలిచింది.

సుగుణ పలకలేదు. మూతి ముడుచుకొని అమ్మదగ్గరికివచ్చి,

"అమ్మా చూడవే అత్తయ్య నన్ను ఊరికే, కుంటీ, కుంటీ అని పిలుస్తుంది" అని చెప్పింది. శేషమ్మ కిలకిలా నవ్వి సుగుణను అమాంతంగా చేతుల్లోకి తీసుకొని రెండు బుగ్గలూ కందిపోయేట్లు గట్టిగా ముద్దు పెట్టుకొని,

"ఏవమ్మా వదినా, ఎందుకమ్మా మాతల్లిని కుంటీ అంటావుట! సుగుణా అని పిలవ కూడదటమ్మా" అని వినయంగా నవ్వుతూ అంది. రంగమ్మ నీళ్ళబిందె నడుముమీద పెట్టుకొని ఇంట్లోకి తెస్తూ, "ఏమేపిల్లా నీవు కుంటిదానివి కాదటే. ఓయబ్బా, కుంటీ అని పిలవంగానే, ఎక్కడ మొక్క పోయిందో చూపించమ్మా! నీకు మంచి చక్కటి మొగుణ్ణి తెచ్చి పెళ్ళి చెయ్యమని మీ నాన్నతో చెప్తాలేవే, నీకేమీ దిగు లేదూ" అని ఎగతాళిగా మాట్లాడింది.

"హయ్యో తల్లీ, ఈ కుంటిపిల్లను ఎవరు చేసుకుంటారు వదినా?" అని శేషమ్మ, వదినవైపు నవ్వుతూ చూచింది.

"దానికేమే, బంగారుతల్లి, దానిముఖమే వెయ్యివరహాలు చేస్తుంది. ఎవ్వరూ చేసుకోకపోతే, మీ చంద్రం ఉన్నాడుగా? వాడికే ముడిపెట్టేస్తే వాడితో బాటే, 'గాంధీమహాత్మాకీ జై, కాంగ్రెసుకీ జై' అంటూ కుంటికాలు ఎగరేసుకుంటూ, ఊళ్ళూళ్ళు తిరుగుతూ ఉంటుంది." అంది రంగమ్మ.

"బాగుంది నీవు చెప్పేది. వాడికి ఈ దిక్కడవుతుందే? అయినా వాడు స్థిమితంగావుంటే అనుకోవచ్చు. జైళ్ళకు పోనూ, రానూ సరిపోతూఉండె వాడికి. సంసారం చెయ్యాలని ఆపేక్ష ఉంటేగా?" అని శేషమ్మ సుగుణ తల నిమురుతూ కూచుంది.

దయలేని దేవుడు సుగుణకు తీరని అన్యాయం చేశాడు. ఆమెను కుంటిదాన్ని చేసి ఈ లోకంలో వదిలిపెట్టాడు. అసలే ఆడపిల్ల; కుంటిది. ఇంక దానికి పెళ్లి ఎట్లా అవుతుందా? అని సుగుణ పుట్టిననాటినుండీ, శేషమ్మకు ఒకటే దిగులు. వీలు దొరికినప్పుడల్లా అందరి దగ్గరా తన దిగులు వెళ్ళబోసుకొనేది.

సుగుణ తండ్రి రాఘవయ్య చిన్న వకీలు గారి దగ్గర గుమాస్తా. ఆయన శేషమ్మలాగా ఎప్పుడూ సుగుణసంగతి ఆలోచించేవాడే కాదు. కోర్టు పత్రులదగ్గర అణా, బేడా దండుకోవడంలో, ఆయన హృదయం మోడువారిపోయింది.

కొన్నాళ్ళకి సుగుణకు తమ్ముడు గూడా పుట్టాడు. అప్పుడు సుగుణకు ఆయిదేళ్లు. తమ్ముడు మొట్టమొదట ఏడ్చిన ఏడుపు ఇంట్లోనుండి వినిపించగానే, సుగుణకి గొప్ప సందేహం కలిగింది.

అందరినీ తోసుకుంటూ ఇంట్లోకి వెళ్ళింది. "పోమ్మా పో, ఇప్పుడు రాకూడదు" అని ఆడంగులు అంటున్నా సుగుణ వినిపించుకోకుండా మంచందగ్గరికి వెళ్ళి, తల్లి పక్కలో ఉన్న బుజ్జితమ్ముణ్ణి తనివి

తీరా చూచింది. తమ్ముడి కాళ్లు రెండూ ఆసక్తితో జాగ్రత్తగా చూచి, సంతోషంతో పొంగిపోయింది. సుగుణ ఇంట్లో నుండి వాకిటికిలోకి వచ్చి కూచొని, తన కాలు ఒకసారి చూచుకొంది. ఒక పాదం, ముద్దలాగా ఉంది. వ్రేళ్లు వంకరతిరిగిపోయి ఉన్నాయి. "అలా ఎందుకుందో" అని సుగుణ కొంచెంసేపు ఆలోచించింది. కానీ సమాధానం దొరకలేదు.

ఒకనాడొక కుంటివాడు ముష్టికొచ్చాడు. చేతుల ఆధారంతో జరుగుతూ, మెల్లగా యింటింటికీ తిరుగుతున్నాడు. వాడు రాగానే సుగుణ ఆశ్చర్యంగా చూస్తూ నిల్చొని—

"మీదేవూరబ్బీ" అని అడిగింది.

"బుల్లెమ్మా, మాది హైద్రాబాదు; ఆ దేవుడికి ఎంతబుద్ధి లేదమ్మా? ఇంత చక్కటి పిల్లకు, కుంటికాలిచ్చాడు, ఏంచేస్తాం తల్లీ మన కర్మకు దేవు డేం చేస్తాడు?" అన్నాడు.

సుగుణ ఇంట్లోకి వెళ్ళి దోసిలినిండా బియ్యం తీసుకొచ్చి ముష్టివాడికి పెట్టింది.

రంగమ్మ సుగుణను తరుముకుంటూవచ్చి, "ఒసే కుంటిముండా, ఎవరికే సేరుబియ్యం తీసుకెళ్లి పోస్తున్నావు" అని కేకలేస్తూ వాకిటిలోకి వచ్చి, ముష్టివాణ్ణి చూచింది. పెద్ద దున్నపోతులాగా ఉన్నాడు. ఒళ్లంతా దుమ్ముకొట్టుకు పోయిఉంది. ఒక చొక్కా, చిన్న చెడ్డీ వేసుకొని ఉన్నాడు. "ఏమయ్యా, పెద్ద ఆంబోతు లాగా ఉన్నావే, ఎందుకీ దొంగవేషాలు! లక్షణంగా ఏదైనా పనిచేసుకోక, ఎందుకయ్యా యీ అవస్థ" అని అడిగేసింది. అతను మెల్లగా తల పైకెత్తి, రంగమ్మ ముఖంలోకి చూచాడు. ఆ చూపును వర్ణించడానికి మాటలు చాలవు. ఎంతటి ప్రతిభావంతుడైన నటుడైనా ఆ చూపు నటించలేడు.

"అమ్మా! నేను బి. ఏ. దాకా చదువుకున్నాను. రైల్వేలో గుమాస్తాగా చేరాను. పెళ్లి చేసుకున్నాను — రెండుకాళ్ళకూ పక్షవాతం వచ్చింది. భార్య వదిలిపెట్టి వెళ్ళిపోయింది. ఒక అన్నదమ్ముడుంటే వాడు వాడి సంసారం పోషించుకోలేక నానా యిబ్బందులూ పడుతున్నాడు. అన్ని ఆస్పత్రులూ తిరిగాను. ఎందరు డాక్టర్లో చూచారు. కానీ ఎవ్వరివల్లా కాలేదు. నాకు ఈ ప్రపంచంలో ఇంకెవ్వరూ లేరమ్మా. ఎప్పటికైనా ఆ భగవంతుడికి దయకలిగితే..." అని దుఃఖము ఆపుకోడానికోసం గట్టిగా పళ్లు బిగబట్టాడు.

రంగమ్మ ముఖం వెలవెలపోయింది. కానీ ఆమెకు ఆ కుంటివాడిమాటలు నిజమో కాదో తెలుసుకోవాలని కుతూహలం కలిగింది.

"ఒసే సుగుణా ఇంట్లోకిపోయి, ఏదైనా ఇంగిలీషు రాసిఉంటే కాగితం తీసుకురా. వీడి సంగతేమిటో కనుక్కోవాలి" అంది. సుగుణ గునగున నడిచిపోయి నాన్నగారి కాయితాల్లోంచి ఒక కట్ట కాగితాలు తీసుకొచ్చింది.

రంగమ్మ ఠీవిగా నిల్చొని "అబ్బాయ్, ఇదేమిటో చదువు చూసాం" అంది.

ఆ కుంటివాడు ఇంగ్లీషు కాగితం చదివి అర్థం చెప్పాడు. అవేవో కేసు తాలూకు కాగితాలు. ఒకావిడ తన భర్త ఆస్తిని దుర్వినియోగం చేస్తున్నాడని, తనను తన బిడ్డల్ని కాపాడమని, న్యాయమూర్తులకు విన్నపం చేసుకున్న కాగితాలు అవి.

అది విని రంగమ్మ "అమ్మో వీడు అసాధ్యుడులా ఉన్నాడే" అనుకొని, కొంచెం పశ్చాత్తాపపడి, "అయ్యో నాయనా, ఎంత కష్టం వచ్చిందిరా నీకు?" అని లోపలికి వెళ్లిపోయింది. ఆ కుంటివాడు సుగుణకు చూపులతో ధన్యవాదాలు అర్పించి, నెమ్మదిగా జరుగుతూ వెళ్లిపోయాడు. సుగుణ అతనివైపే చూస్తూ కొంతసేపు నిల్చుంది.

## 2

కొంతమంది మనుషులకు పసిపిల్లలను ఏడిపించుకొని ముచ్చటపడడం అలవాటు. సుగుణ మేనత్త రంగమ్మకు సుగుణను ఏడిపించుకొని తినటం చాలా ముచ్చట.

ఒకనాడు రంగమ్మ వకీలుపోజులో నిల్చొని "ఏమే శేషూ? దీని కన్నేళ్లు?" అని అడిగింది. "అయిదో ఏడే కదటమ్మ వదినా" అని నీరసంగా జవాబిచ్చింది శేషమ్మ.

"దీన్ని బడికి పంపించకూడదూ? ఇంట్లో ఉండి ఏంచేస్తుంది?" అంది.

"హాయ్యోరామ. దాన్ని బడికి పంపించడానికి తాతముత్తాతలు దిగిరావాలి. నావల్ల కాక వదిలేశాను" అంది శేషమ్మ.

రంగమ్మ ఉక్కురిమి కోపం నటిస్తూ "ఒసే పిచ్చిముండా; బడికిపోయి శ్రద్ధగా చదువుకోవే. అసలే కుంటిముండవు. చదువు రాకుంటే, నిన్నెవరు పెళ్ళిచేసుకుంటారే? పో ముందు బడికి" అని దబాయించింది.

"పోమ్మా పో" అని శేషమ్మ పల్లవిపాడింది. సుగుణ పిల్లిలాగా మెల్లిగా ఇంట్లోకి వెళ్ళి, పలక బలపం తీసుకొని, తన స్నేహితురాలు సరోజనిదగ్గరికి వెళ్లి "సరోజా, ఇవాళ నేనుకూడా బడికి వస్తానే" అంది.

సరోజ ఎగిరి గంతేసింది. "మనిద్దరం, ఒక బెంచీమీదే కూచుందామే సుగుణా, మన దగ్గరికి ఇంకెవ్వర్నీ రానివ్వకూడదు" అంటూ బడికి బయలుదేరింది.

సరోజని తాలూకాఫీసులో గుమాస్తా, రామారావుగారి కూతురు. సుగుణా సరోజా ఇద్దరూ ఒక ఈడువాళ్లే. ఒకరి భుజాలమీద ఒకరు చేతులేసుకొని మెల్లగా బడికి చేరుకున్నారు.

ఇంకా అయ్యవార్లు ఎవ్వరూ రాలేదు. పిల్లకాయలు గొర్రెలమందలాగా గోలచేస్తున్నారు. సరోజని, సుగుణ బడిలో అడుగుపెట్టగానే, సుగుణ తన జీవితంలో ఎన్నటికీ మరిచిపోలేని సంఘటన ఒకటి జరిగింది.

ఒక అబ్బాయి సుగుణకు ఎదురుగావచ్చి నిలబడి కళ్లల్లో కళ్లు పెట్టిచూచి, వినయంగా వంగి "హాలో, డియర్ కుంటి కులాసం గారూ, గుడ్‌మార్నింగ్" అన్నాడు.

సుగుణ, సరోజని చెయ్యి గట్టిగా పట్టుకొని, ఒదిగి నిల్చుంది. సరోజని చెయ్యి విడిపించుకొని బాగా పైకెత్తి ఛెళ్లున ఒక చెంపదెబ్బ కొట్టింది వాణ్ణి. వాడికి చీమకుట్టినట్టయినా లేదు. సరోజనిని ఒక్క తోపుతోసి సుగుణదగ్గర చేరి:

"కుంటి కులాసం, ఇంటికి పోసం" అని పాడుతూ డాన్సు చెయ్యడం మొదలుపెట్టాడు. మిగిలిన పిల్లలు కొంతమంది దద్దమ్మల్లా కూచున్నారు. కొంతమంది కిలకిలా నవ్వుతూ ఆనందిస్తున్నారు.

సరోజని, సుగుణను దగ్గరికి లాక్కొని "ఒరేయ్ మోహన్, చూస్తాండు నిన్ను ఇవాళ ఏమిచేస్తానో. చూస్తూండు. అయ్యవార్ని రానీలే" అని త్రాచుపాములాగా బుసకొడుతూ అంది.

ఆయన ఇంటికి రాగానే ఆవిడతో చెప్పాడు.

"నేనీ వేళ నా జీవితం భీమా చేయించు కున్నాను"

ఆవిడ పనితో సతమత మౌతూ విసుగుతో ఇచ్చిన సమాధానం ఇది.

"ఎన్నాళ్లు మీ విషయమే మీకు గాని మా గొడవ పట్టదు. మీరు భీమా చేయించుకుంటే చేయించుకున్నారు గాక. అంత మాత్రాన నాకేం ఒరిగింది?"

మోహన్ డాన్సు చెయ్యడం క్షణంసేపు ఆపి, "హార్యో దేవుడా, నేనేం చేసే దయ్యా, ఈరోజు సరోజనీదేవిగారు నాకు మెడకాయమీద తలకాయ లేకుండా చేయిస్తారేమో" అని వినయంగా వంగి—

"రాణిగోరూ? ఏదో దయనూపండి. పేదోణ్ణి" అన్నాడు. పిల్లలందరూ గొల్లున నవ్వేరు.

ఇంతలోగా, శుభ్రంగా తయారయి, స్కూల్లో అడుగుపెట్టిన ఇంకొక ఎనిమిదేళ్ల అమ్మాయి సుగుణను, సరోజనిని చూచింది. ఒక్కసారి చిరునవ్వు నవ్వి మోహన్‌వైపు చూచింది. మోహన్ సంతోష సాగరంలో మునిగి తేలుతూ "కుంటి కులాసం, ఇంటికి మోసం" అని హరిదాసులాగా పాడుతున్నాడు.

కొత్తగావచ్చిన అమ్మాయి మోహన్‌తో పాటు గొంతుకలిపి, "సా, స, ని, ధ, ప, మ, గ, రి, స కుంటి కులాసం, ఇంటికి మోసం" అని పాట అందుకుంది. పిల్లలందరూ పొట్ట చెక్కలయ్యేట్లు నవ్వుతున్నారు. సుగుణ అవమానం భరించలేక, పెద్దగా ఏడవడం ప్రారంభించింది. సరోజని కోపంతో రగిలిపోయింది. పరుగెత్తుకుంటూ వెళ్ళి స ని ధ ప మ గ రి స లు చేస్తూ తన్మయత్వంలోఉన్న కమలను, రెండు జడలు, రెండుచేతులతో పట్టుకొని, వెంకాయపీచు తీసినవిధంగా లాగి లాగి, ఇంకా కసితీరక చేతిమీద గట్టిగా కొరికింది.

పాపం, కమల బావురుమని ఏడుస్తూ దిక్కులేనిదానిలాగా నిల్చుంది.

"ఏమిట్రా ఇది, ఏమిట్రా, ఈగోల," అంటూ బిచ్చగానిలాగా ఉన్న ఒక సన్నటి వ్యక్తి లోపలికొచ్చాడు. పిల్లలందరూ


## అబలసుధ

స్త్రీ కుసుమ వ్యాధులు. అకాల బహిష్టు, ఋతుబద్ధము, ఋతుశూల, ఒడలునొప్పులు, తలనొప్పి, గుండెదడ. కాళ్ల లాగుట, మనస్థిమితము లేకపోవుట, నిద్రపట్టకుండుట, నడుమునొప్పులు, బలహీనత, మలబద్ధము, హిష్టీరియా మొ॥ హరించును.

వీసా రు. 3/- వి. పి. రు. 1/-

ఇండియన్ మెడికల్ హౌస్
లక్ష్మి టాకీసు రోడ్డు - విజయవాడ-2.)


బెంచీలమీద కొందరు, కటిక నేలమీద కొందరూ, కూచున్నారు. కొంతమంది తాము బెంచీలమీదే కూచోవాలని, లేకుంటే గుడ్డలు మాసిపోతాయని పోరాడుతున్నారు. కమల దిక్కులేనిదానిలాగా ఏడుస్తూ, తనచెయ్యి అయ్యవారిదగ్గర పెట్టి, "సార్, చూడండిసార్, సరోజని ఎట్లాకొరికిందో చూడండిసార్" అని వెక్కిళ్లు పెడుతూ చెప్పింది.

వెంటనే సరోజని "సార్, నేను...ఈ అమ్మాయిని బడికి తీసుకొస్తే, కుంటికులాసం ఇంటికి మోసం అని పాటలు పాడుతూ, మోహన్, కమల, ఏడిపించుకొని తింటున్నారుసార్" అని మనవి చేసింది.

"ఒరేయ్ మోహన్; ఏడిరా వాడు?" అని పంతులుగారు నాలుగుదిక్కులా చూచాడు. మోహన్ బుద్ధిమంతుడిలాగా కూచొని ఏదో రాసుకుంటున్నాడు.

"ఒరేయ్‌దొంగా, రా యిట్లా" అన్నాడు మేష్టరు.

"ఏమిటిసార్ ? నాకేమీ తెలియదు సార్" అని మోహన్ నిర్దోషిలాగా నిల్చున్నాడు.

"ఒరేయ్ బడుద్దాయ్, అటు గోడమీద చూడు" అని చూపించాడు అయ్యవారు.

"సత్యమే జయించును; అబద్ధము లాడరాదు" అన్న నీతి వాక్యాలు గోడలనిండా అంటించిఉన్నాయి. మోహన్ వాటిని ఒకసారి చదివి, అబద్ధం చక్కగా నమ్మేట్లు ఎలా చెప్పాల్నా అని బాగా ఆలోచించి, "బడికి మీతోకూడానే వచ్చానుసార్ నేను వచ్చేటప్పటికి, సరోజని, కమల, తన్నుకుంటున్నారు" అని సంగనాచిలా చెప్పాడు.

"బాబ్బాబ్బా, పిడుగువురా నువ్వు. చస్తే ఇంక పుట్టబోవు" అన్నాడు అయ్యవారు విసిగి.

"నరేసార్, చచ్చిపోతా లెండి సార్" అని బుంగమూతి పెట్టుకొని అన్నాడు మోహన్. పిల్లలందరూ గొల్లున నవ్వారు.

"ఒరేయ్ వెధవా యిల్లా రా నేను అన్నం తిని రాలేదు. కడుపు మండిపోతూ ఉంది. ఇప్పుడు నన్ను విసిగించారంటే, ఒక్కొక్కరిని తోలు ఒలిచేస్తా" అన్నాడు అయ్యవారు.

కమల ఇంకా ఎక్కిళ్లు పెడుతూ, ఏడుస్తూనే ఉంది.

పంతులుగారు సరోజనిని చెవ్వు పట్టుకొని ఆ అమ్మాయిని అట్లా ఎందుకొరికావ్ ? నీవేమైనా కుక్కవా, మనిషివా చెప్పు చెప్పు" అంటూ చెవ్వు కసకస నలిపేశాడు.

సరోజని "అమ్మా, అమ్మా" అని గిజగిజలాడుతూ ఏడిచింది. అదిరిపోయాడు అయ్యవారు. "అదికాదమ్మా, చూడు, ఆ అమ్మాయి, నీలాంటి పిల్లకదూ? అట్లా కొరకొచ్చా?" అని మళ్ళీ ఓదార్పడం ప్రారంభించాడు.

"సుగుణను, కుంటిపిల్ల అని కమల ఎగతాళి చేస్తూఉంది సార్" అని సరోజని అయ్యవారికి మనవి చేసింది.

అయ్యవారు మళ్ళీ తనను కొడ్తాడేమోనని కమల ఏడుపు శృతి ఎక్కువచేసి, భోరున ఏడవడం ప్రారంభించింది.

"హార్యో భగవంతుడా? జన్మ జన్మలకి, ఈ బడిపంతులుపని వద్దురా" అని అయ్యవారు చెవులుమూసుకొని, తనను కడతేర్చమని దేవుణ్ణి ప్రార్థిస్తున్నట్లుగా కళ్లు మూసుకున్నాడు.

"ఏమిటయ్యా ఈ గోల?" అంటూ హెడ్మాష్టరుగారు లోపలికొచ్చారు.

"ఏమీ లేదండి, ఏమీ లేదండి" అని చిన్న పంతులుగారు సర్దుకుని "ఇది ఒక ఆవు. దీనికి నాలుగు కాళ్లుండును" అని పాఠం చెప్పడం ప్రారంభించాడు. హెడ్ మాష్టరుగారు తృప్తిపడి "ఒరేయ్ అయిదో క్లాసు వెధవల్లారా, మీరు పదకొండవ యొక్కం మొదలు, యిరవై ఎక్కంవరకు వేసి నా దగ్గరికి తీసుకరండి" అని ఆజ్ఞాపించి, తన కుర్చీలో వెళ్లికూచొని గవర్నమెంటువారిచ్చే గ్రాంటులో ఎంత గుటకాయస్వాహా చెయ్యడానికి వీలుంటుందా" అని ఆలోచించడం ప్రారంభించాడు.

ఎప్పుడెప్పుడు గంటకొడతారా, అక్కణ్ణో నుంచి ఎప్పుడు బయటపడదామా అని సుగుణ ఎదురుచూస్తూ కూచుంది. బడి వదలంగానే సంతోషంతో సరోజని చెయ్యి పట్టుకొని వీధిలోకి పరుగెత్తింది. కానీ మోహన్‌మాత్రం సుగుణను, ఇంటికి పోయేవరకు ఏడిపించుకొని తిన్నాడు. పాపం కమల ఇంకా ఎక్కిళ్లు పెడుతూనే ఉంది.

ఆ రోజునుంచి సుగుణ మళ్ళీ బడిలో అడుగు పెట్టనేలేదు. ఆనాటి సంఘటన ఆమె హృదయంలో శాశ్వతమైన గాయంగా నిలిచిపోయింది. అందువల్ల ఆమెలో కొంత పిరికితనం వృద్ధిఅయింది.

కానీ రంగమ్మ వదిలిపెట్టేటట్లు లేదు. "ఏమే శేషూ, దాన్ని బడికి పొమ్మని చెప్పవేమే?" అంది.

"ఏం చెయ్యను వదినా, ఆ దయ్యం

పోతేగా. దానికి చదువుకోవాలని ఉంటే అనుకోవచ్చు" అంది శేషమ్మ.

"నేను ఇంట్లోనే చదువుకుంటా శేషమ్మా. బడికి పోతే పిల్లలందరు ఏడిపించుకొని తింటున్నారమ్మా" అని సుగుణ కళ్ళనీళ్లు పెట్టుకుంటూ చెప్పింది.

"ఓసి జాణకదే, జాణా; బడికిపోకుంటే చదువెట్లా వొస్తుందే నీకూ? ఏమోలే, నా మంచికే చెప్తున్నాను. వేలు వేలు పోసి, అల్లుణ్ని తీసుకొస్తారుగా; చదువుకోకపోతే మాత్రం ఏం?...బుద్ధి తక్కువదాన్ని నే నెందుకు చదువుకోలేదా అని ఇప్పుడనుకుంటున్నాను. మొగుడు లేకపోతే పోయాడు మొద్దులు. చదువుకొనైనా ఉంటే, నేనూ ఒక అయ్యవారమ్మనయి ఉండేదాన్ని ఇంటింటా ఈ వంటచాకిరీ తప్పేది" అని తన మనసులోని అక్కసు వెళ్లబోసుకుంది. వదినగారితో వాదించటం ఎందుకని శేషమ్మ ఊరుకుంది.

## 3

ఆవాడు సుగుణతమ్ముడికి బారసాల. ఇంట్లో అందరూ స్నానాలుచేసి పురుడు తీర్చుకొన్నారు. ఇలంతా ముగ్గులు పెట్టి చుట్టూ ఎఱ్ఱమట్టిపట్టీలు తీర్చి దిద్దింది రంగమ్మ. ఇల్లు కొత్త అందంతో కళకళలాడుతూ ఉంది.

రంగమ్మ ఇంట్లో చాకిరీఅంతా చేసుకొని పెన్నానదికి పోయి స్నానంచేసి, రంగనాయకస్వామికి ప్రదక్షిణాలు చేసుకొని ఇంటికొచ్చేసరికి పదిగంటలయింది. పొద్దు చూచి, గాభరాపడి ఆమె వంటప్రయత్నంలో నిమగ్న అయింది.

సుగుణ, వాకిటఅరుగుమీద బోర్లా పండుకొని గుణింతాలు దిద్దుకుంటూ ఉంది.

ఎవరో వచ్చి, సుగుణవీపుమీద తలఆనించి పడుకున్నారు.

"ఏయ్; ఎవరునువ్వు; లే. లే. అమ్మా" అని సుగుణ ఆ మనిషిని తోసేస్తూ అరిచింది. ఆ పెద్దమనిషి లేవకుండానే

"హాబ్బా! దిండు ఎంత మెత్తగా ఉంది! అరె! దిండు మాట్లాడుతూ ఉందే! అరరె దిండుకు కాళ్లూ చేతులూ కూడా వచ్చాయే!" అని మెల్లగా లేచి సుగుణను దగ్గరికి తీసుకున్నాడు.

శేషమ్మ బాలింతముసుగు సవరించుకుంటూ ఇంట్లోనుండి గబగబా వచ్చి,

"ఏంనాయనా చంద్రం, ఇప్పుడేనా రావటం?" అని గద్గదస్వరంతో అడిగింది.

"అవునక్కయ్యా మొన్ననే జైలునుంచి విడుదల అయ్యాను" అన్నాడు చంద్రం.

ఇంట్లోనుంచి పసిబిడ్డఏడుపు వినిపించింది. చంద్రం నవ్వుతూ అక్కయ్య ముఖం చూచాడు.

శేషమ్మ తమ్ముడికిఎదురుగా కూర్చుంటూ

"అల్లుడు పుట్టాడయ్యా నీకు, ఈరోజే బారసాల. చుట్టాలు రాలేదనే కొరత రానీయకుండా భగవంతుడు నిన్ను ఇక్కడికి పంపించాడు." అని శేషమ్మ ముఖానికి పమిట చెరగు అడ్డం పెట్టుకుంది.

సుగుణ చంద్రంచేతుల్ని విడిపించుకుని అమ్మదగ్గరకు పోయి కూచొని, "అమ్మా, ఆయ నెవరే?" అని మెల్లగా అడిగింది.

శేషమ్మజాలిగా సుగుణకళ్లల్లోకి చూస్తూ



ఇలాంటి పరిస్థితి
ఏర్పడినప్పుడు...

చదరంగంఆటలో రాజుకు "షా" చెప్పినప్పుడు రాజును వున్న గడినుంచి మరొక చోటికి మార్చడమో లేక అతని బలగాన్ని అడ్డువేయడమో జరిగితీరాలి కనుక ఆట మొత్తంలో ఉద్రిక్త పరిస్థితి ఏర్పడుతుంది.

అట్టి స్థితిలో చదరంగపు ఆటలో మేథావి తన కౌశలాన్ని, చాతుర్యాన్ని, దూరదృష్టిని ఉపయోగించాలి. అలాంటిస్థితిలో ఒకకప్పు చక్కని తేనీరుతో సమానమైనది మరొకటి వుండదు.

తేనీరు
మీ చతురతను
నిలబెట్టగలదు

టీ బోర్డు ప్రకటన

PSTB 123

# ★ సుగుణ ★

"మీ మామయ్యేనమ్మా. నీ పెళ్ళప్పుడైనా వాణ్ణి చూస్తేగా" అని దుఃఖం అణుచుకుంటూ చెప్పింది.

సుగుణ మెల్లగా తలెత్తి మామయ్యను సిగ్గుతో ఒకమారు చూచి "అమ్మో! మామయ్య బలేబాగున్నాడే!" అని మనసులోనే అనుకుని, తల్లి ఒడిలో తలదాచుకొంది.

రాఘవయ్యగారు, కాగితాలకట్ట చంకలో పెట్టుకొని త్వరత్వరగా వచ్చి, చంద్రాన్ని చూచి, ఆశ్చర్యపడి గడపలోనే నిల్చొని, "ఎప్పుడొచ్చావు బావా?" అని మెల్లగా అడిగి హృదయపూర్వకంగా చిరునవ్వు నవ్వాడు.

"ఇప్పుడే వస్తున్నాను బావా" అని చంద్రం బావగారికి జవాబిచ్చాడు.

"ఏమే, వాడు జైలునుంచి విడుదలైవస్తే అప్పుడే దగ్గరకూర్చొని నీసొద ప్రారంభించావా? ఇంత కాఫీ అయినా ఇచ్చావా లేదా?" అన్నాడు రాఘవయ్య.

"హారొమ్యో రామ. లేదండీ" అని శేషమ్మ లేచి లోపలికెళ్ళి చంద్రం వచ్చాడని రంగమ్మ వదినకు చెప్పింది.

రంగమ్మ, కూరతరగబోతవేస్తూ, గిన్నె వళ్ళాలున కిందపడేసి, వాకిటికి వచ్చి గొంతు సవరించుకొని; "ఏంనాయనా చంద్రం. మేము జ్ఞాపకమున్నామన్న మాట" అంది.

"హారొమ్యా, ఏమిటి వదినా నేనేమి అంత మతిమరుపు మనిషి ననుకున్నావా?"

"కాదులే, మీరంతా దేశోద్ధారకులు. మామోటివాళ్ళం జ్ఞాపకం ఉంటామా?" అని నవ్వింది రంగమ్మ.

ఇంతలో శేషమ్మ కాఫీ తీసుకొచ్చి చంద్రానికి అందించింది.

రంగమ్మ చంద్రానికి ఎదురుగా కూర్చొని "నేను నీలాగా చదువుకున్న దాన్ని కాదు. కానీ నాకు తోచినమాట నే చెప్పేదీ మనసులో పెట్టుకోనేదాన్ని కాదు. ఏమిట్రా ఈ పాడుముండ ఇలా అన్నది అని నీవు అనుకుంటే అనుకోవచ్చు- లక్షణంగా పెళ్ళిచేసుకొని సంసారం చెయ్యక, ఎందుకు చెప్పు ఈ తంటాలు? అది నీకోసం ఎంత ఇదవుతుందో నీకేం తెలుసు? పుట్టింటి ఆశ అంటూ ఏ ఆడదానికైనా ఉంటుందా ఉండదా? నీవే చెప్పు. ఇంక దానికి నీవుతప్ప ఇంకెవ్వరున్నారు?" అని రంగమ్మ చంద్రం కళ్ళల్లోకి ధీమాగా చూచింది.

ప్రతిష్ఠమైన నంజనగూడు పండ్లపొడి వారి
అగత్యమైన కుటుంబ ఔషధములు
కాస్మస్ కస్తూరి మాత్రలు...సీసా 0-6-0
కర్జక గోరోజనీ మాత్రలు... .. 0-6-0
బాలక్స్ విరేచనమగుటకు మాత్రలు ... 0-6-0
మా మందుల పూర్తి జాబితాకు వ్రాయుడు
యునైటెడ్ కన్సర్న్, బందరు వీధి, మద్రాసు-1. విజయవాడ.

ఆడవాళ్ళు మాట్లాడినంత చాతుర్యంతో మగవాళ్ళు మాట్లాడలేరు.

చంద్రం, ఎన్నో సభల్లో ఉపన్యాసాలిచ్చాడుకాని రంగమ్మప్రశ్నకు జవాబు చెప్పడానికి కొంచెం తడబడ్డాడు.

"నిజమే వదినా...లోకంలో కొంత మంది సుఖపడ్డానికోసం పుడతారు; కొంత మంది కష్టాలుపడ్డం కోసం పుడతారు. నాలాంటివాళ్ళకి కష్టాల్లోనే ఏదో సుఖం ఉన్నట్లు కనిపిస్తుంది." అని, కాఫీ ఒక గుక్కెడు త్రాగి, లోటావైపే క్షణం సేపు చూచాడు. చంద్రం మనసులో చాలా సంఘర్షణ ఏదో జరుగుతూఉందని రాఘవయ్య అర్థం చేసుకొన్నాడు.

"ఏమిటమ్మా నీసొద? వాడు రాకరాక ఇంటికొస్తే, నీ రామాయణం వాడిముందు పారాయణంచేస్తే ఎలాగూ?" అన్నాడు.

రంగమ్మకు, మొగవాళ్ళతో మాట్లాడడం అంటే చాలాయిష్టం. పాపం చిన్నప్పుడే భర్త చనిపోయాడు - మనసులోఉన్నమాట ముఖాన్నే అడిగేస్తుంది. అందువల్ల ఆమె అపవాదులూ, ప్రమాదాలూ చాలాసార్లు ఎదుర్కోవాలిసొచ్చింది.

"బుద్ధిః కర్మానుసారిణీ, అన్నారు. మనం నిమిత్తమాత్రులమే. జరిగేదెటూ జరుగుతూనే ఉంటుంది" అంది రంగమ్మ.

"వదినగారికి వేదాంతంలోకూడా బాగా పాండిత్యంఉన్నట్లుందే?" అని చంద్రం పకపకా నవ్వాడు. రంగమ్మకూడా తృప్తిగా నవ్వి వంటయిట్లోకి వెళ్ళిపోయింది. ఒక మగవాడు కొంచెం సానుభూతి చూపి మెచ్చుకొంటే చాలు, ఆమె హృదయం తృప్తిపడిపోతుంది.

నామకరణం చేయించడానికి పురోహితుడొచ్చాడు.

"ఏమిటిబావా; నీవు సంపాదించేది పది రూపాయలైనా, ఖర్చుపెట్టేది వందగా ఉందే?" అన్నాడు చంద్రం.

"ఏమిచేస్తాంరా, మన ఆచారాలు, సంప్రదాయాలూ పోగొట్టుకుంటామా? మా కాలం ఇలాగే వెళ్ళిపోతుంది. మీ తరం వచ్చేటప్పటికి, అసలు తద్దినం పెట్టేవాళ్ళు కూడా ఉండరు." అన్నాడు రాఘవయ్య.

"ఇంత దుబారా ఖర్చు చేసుకుంటుంటే నీవు ఇంక మిగిల్చేదేముంది బావా? కొంచెం ముందు జాగ్రత్త ఉండకపోతే సంసారం జరగాలన్న పనిలేదా?" అన్నాడు చంద్రం.

రాఘవయ్య పకపకా నవ్వి "నీకేం మిగిల్చావో చెప్పు నాయనా. తండ్రి సంపాదించిపెట్టిపోయిన ఆస్తి, కాంగ్రెసులో చేరి చిల్లిగవ్వ లేకుండా చేశావు. నీవు నాకు సలహా చెప్పొస్తున్నావు" అన్నాడు.

"నాకూ నీకూ భేదం లేదా బావా? నేను సన్యాసిని. నీవు సంసారివి" అన్నాడు చంద్రం.

"రాఘవయ్యా, ఇంకా స్నానం చెయ్యలేదాయ్యా?" అన్నాడు పురోహితుడు.

రాఘవయ్యగారు లేచి స్నానానికివెళ్తూ "ఒరేయ్ చంద్రం, రారా, నీవు కూడా స్నానం చేద్దువు గాని" అన్నాడు.

స్నానాలు పూర్తయిన తర్వాత, నామకరణ మహోత్సవం ప్రారంభమయింది.

"మీ అల్లుడికి పేరు ఏం పెట్టమంటావు చంద్రం?" అన్నాడు రాఘవయ్య.

"సుభాష్ చంద్రబోస్ అని పెట్టెయ్ బావా" అన్నాడు చంద్రం. అందరూ ఒక్కసారి గొల్లున నవ్వారు.

"ఛీ, ఛీ, ఆ పేరెందుకురా. లక్షణంగా, రంగనాయకుల పేరో, వెంకటేశ్వరస్వామి పేరో పెట్టుకోక! అంత ఇంకా ముచ్చటగా ఉండాలనుకుంటే, సుధాకరుడు అని పెట్టండి" అంది రంగమ్మ.

అందరూ సరే నన్నారు. రాఘవయ్యగారు ఉంగరం తీసుకొని బియ్యంలో రాసేశాడు.

రంగమ్మ "నాకు ఈ ఇంట్లో ఇంత మాత్రం హోదా ఉంటే చాలు" అనుకొని ఆనందంతో పొంగిపోయింది.

భోజనాలయినతర్వాత చంద్రం సుగుణను దగ్గర కూచోపెట్టుకొని ఎన్నో కథలు చెప్పాడు. సాయంత్రందాకా మామయ్యను వదిలిపెట్టకుండా తిరిగింది సుగుణ.

జిల్లా కాంగ్రెసుసమావేశం ఉందని ఆరోజు సాయంత్రమే వెళ్ళిపోయాడు చంద్రం.

"అమ్మా, మామయ్య మళ్ళీ ఎప్పుడొస్తాడే" అని సుగుణ అమ్మను అడిగింది.

"ఏమోనమ్మా, వాడిమతం వాడిది. ఇష్టం ఉంటే వస్తాడు. లేకుంటే లేదు." అని శేషమ్మ విసుక్కుంది. ★

[ఇంకా ఉంది]



పెద్దకథ

# సుగుణ

జి. సి. రామకృష్ణ

(గత సంచిక తరువాయి)

కాలప్రవాహంలో కొన్ని సంవత్సరాలు దొర్లిపోయాయి.

రెండవ ప్రపంచయుద్ధం ప్రారంభమై, ప్రజల జీవితాల్ని తారుమారు చేసింది.

అన్ని వస్తువులకీ ధర లెక్కువయిపోయాయి. దొంగమార్కెట్టు బలమైపోయింది.

నిత్యదారిద్ర్యంతో కాలం గడుపుతున్న రాఘవయ్యగారి కుటుంబం పెద్ద ఉప్పెన లాగా వచ్చిన ఆమార్పుకి తట్టుకోలేక తల్లడిల్లిపోయింది.

సుగుణ పెద్దదయేకొద్దీ, రాఘవయ్యకూ, శేషమ్మకూ దిగు లెక్కువయింది.

"ఇప్పుడు దాని పెళ్ళికేం తొందరే? కల్యాణంవచ్చినా కక్కొచ్చినా ఆగదు. ఆకాలంవస్తే మన ప్రయత్నమే అవసరం లేదు" అంటుంది మేనత్త రంగమ్మ.

కానీ శేషమ్మకు సుగుణపెళ్ళి విషయమే ఆలోచన.

"ఖాడీజేసుంది, మగపెళ్ళి ఎట్లాగో బతుకుతాడు. దీన్ని ఎవరూ పెళ్ళి చేసుకోకపోతే నేనే గంగలో దూకేదమ్మా" అని విచారించేది. తల్లిమాటలు సుగుణకు బాధ కలిగించేవి.

రంగమ్మ తన మరిది భార్యకు పురుడు పోయడానికి బెజవాడ వెళ్ళిపోయింది.

రెండు సంవత్సరాలు అష్టకష్టాలతో ఎలాగో కాలం వెళ్లబుచ్చారు. పురుగులూ రాళ్లు కలిసిన రేషను బియ్యం తినలేక, ఒకపూట తిండి మానేశారు. రాత్రులు మొక్కజొన్న ఉప్పుపిండిగానీ, రొట్టెలు కానీ చేసుకొని తిని పడుకొనేవారు.

దురదృష్టంకొద్దీ సుగుణ కుంటిదై పుట్టింది కానీ, ఇతరత్రా ప్రకృతి ఆమెకేమీ అన్యాయం చేయలేదు. యౌవనంలో అడుగు పెడుతున్నకొద్దీ సుగుణ కొత్తశోభతో ప్రకాశిస్తూ ఉంది. రాఘవయ్య తనకు తెలిసినవాళ్లందరితోనూ సుగుణ పెళ్ళివిషయం హెచ్చరించాడు. తన శక్తికొద్దీ మర్యాదలు జరుపుతానని విన్నవించుకొన్నాడు. కానీ ఏమీ లాభంలేకపోయింది.

తనకోసం తల్లిదండ్రులు విచారపడడం చూచి సుగుణ తీవ్రంగా ఆలోచించడం ప్రారంభించింది. ఎంతసేపు ఆలోచించినా ఏదైనా ఆధారం దొరికితేగా! ఒకరోజు సాయంత్రం, రాఘవయ్య కోర్టునుంచి వచ్చి విసుగుతో కాగితాలు విసరిపారేసి, "చంద్రాన్ని మళ్ళీ అరెస్టు చేశారట" అన్నాడు.

"ఎందుకని?" అని ఆవేదనతో అడిగింది శేషమ్మ.

"కాంగ్రెసు నాయకుల్నందర్నీ అరెస్టు చేశారు. రైళ్లు పడగొట్టడం, పోలీసు స్టేషన్లు తగలబెట్టడం,...దేశమంతా అల్లకల్లోలమైపోతూ ఉంది" అన్నాడు రాఘవయ్య. శేషమ్మ, గుండె బరువెక్కి తులసికోటవద్దకూర్చొని కళ్లనీళ్లు తుడుచుకుంటూ, "అయితే ... ఇప్పుడు వాణ్ణి ఎక్కడికి తీసుకుపోయారండీ?" అని భర్తనడిగింది.

"రాయవేలూరుకు తీసుకపోయారట"

తల్లిదండ్రులసంభాషణ సుగుణ జాగ్రత్తగావింటూ ఏమీతోచక ఊరకేకూచుంది.

మరునటిరోజు ఉదయం, సుగుణ బాల్యస్నేహితురాలైన సరోజని వచ్చింది.

"ఏమమ్మా సరోజనీ మాయింటికి దారితప్పి వచ్చినట్టుందే?" అని శేషమ్మ చిరునవ్వుతో నిష్ఠురంగా అన్నది.

"దారితప్పడం నాకెప్పుడూ అలవాటు లేదమ్మా. నేను ఎక్కడికైనా వెళ్ళాలనుకుంటే జాగ్రత్తగా దారిచూస్తూనే వస్తాను. సుగుణ వస్తుందేమోనని ఎదురుచూచి చూచి, కళ్లు కాయలుకాచి, ఈరోజు మనస్సు ఉండబట్టక నేనే మీఇంటికొచ్చాను పేదవాళ్లఇంటికి మీరెందుకొస్తారు లేమ్మా" అంది సరోజ

"సరోజా, పేదవాళ్ళెవరయిందీ నీ మనసుకు నీకు తెలీదా?" అంది సుగుణ

"సరే, ఇక ఆసంగతి పోనీగానీ, ఇవాళ సినిమాకు పోదామనుకున్నాం. వస్తావా రావా. ఒక్కమాటచెప్పు" అని ఖచ్చితంగా అడిగింది సరోజ.

సుగుణ తల్లిముఖం చూచింది. శేషమ్మ సరోజనిమాటలు వినీ విననట్లు ఊరుకుంది.

"ఏమమ్మా, సుగుణను ఇవాళ సినిమాకు పంపేస్తావా? లేదా?" అంది సరోజ

"పరేలేవే. దానిదేముంది బ్రహ్మాండం. సాయంత్రం అలాగే వెళ్దురుగాని" అంది శేషమ్మ. సాయంత్రం మళ్లీవస్తానని సరోజ యింటికెళ్ళింది.

"సుగుణా, అది చాలా పోకిరిపిల్ల. నీవు దానితోకూడా తిరుగుతూ, నీ యిష్టంవచ్చినట్టు ఆటలాడావంటే, మేము వేగలేమమ్మా. తర్వాత నీ యిష్టం" అంది శేషమ్మ.

సుగుణకు ఏమి చెయ్యాలో తోచలేదు. సాయంత్రం సరోజని వచ్చింది.

"వాళ్ళ నాన్న వద్దన్నాడమ్మా" అని శేషమ్మ మెల్లగా చెప్పింది.

సరోజనికి పట్టరాని కోపం వచ్చింది.

"కూతుర్ని ఎన్నాళ్లు జైల్లో పెడతావమ్మా? ఒకరోజు సినిమాకు పోతేనే పెద్ద తప్పా?" అని సరోజని విసురుగాం అడిగిది.

శేషమ్మ నవ్వి, "ఎందుకు సరోజా అంత కోపం? మీకేం? మీరు తిరగాలంటారు. ముల్లుమీద అరిటాకు పడినా, అరిటాకుమీద ముల్లు పడినా, అరిటాకుకే నష్టం" అంది శేషమ్మ. సరోజని యిక పలకకుండా ఒక్క విసురున వెళ్లిపోయింది. సుగుణ సందిగ్ధావస్థలో పడింది.

సరోజ చిన్నప్పటినుండి సుగుణను చాలా ప్రేమతో చూచేది. బడిపిల్లలు సుగుణను గోలచేస్తుంటే చూచి ఓర్చుకోలేక వాళ్ళతో పోట్లాడింది అటువంటి స్నేహితురాలి మాట ఎలా త్రోసెయ్యడం? తల్లి మాట వినకపోతే ఆమె మండిపడిపోతుంది.

ఒకనాడు సాయంత్రం సుగుణ తల్లిని ఎలాగో ఒప్పించి సరోజని యింటికి వెళ్ళింది. సరోజని తల్లి కాంతమ్మ వంటయింట్లో ఏదో పనిచేసుకుంటూ ఉంది.

సుగుణ నేరుగా ఇంట్లోకి వెళ్ళింది సరోజని కిటికీదగ్గర నిల్చొని ఏదో గాఢంగా ఆలోచిస్తూఉంది. సుగుణ వెళ్ళి సరోజని వెనక నిల్చుంది; సరోజ గమనించలేదు.

సుగుణ కిటికీలోనించి చూచింది. ఎదురింటి మిద్దెమీద ఒక అబ్బాయి నిల్చొని, సరోజనిని పిలుస్తున్నాడు. సరోజనికూడా చేతివేళ్ళు మాత్రమే కదిలిస్తూ, పిలుస్తూ ఉంది సుగుణ నిశ్చేష్టురాలై పోయింది. కొంతసేపటికి సరోజని వెనక్కు తిరిగి సుగుణను చూచి వెలవెలపోయింది గాభరాతో ఏమి మాట్లాడడానికీ తోచక కొంతసేపు తటపటాయించి "అమ్మ దొంగా...ఎంతసేపయిందే వచ్చి?" అన్నది సుగుణ పకపకా నవ్వి "దొంగలెవరో తెలుస్తూనే ఉంది" అని జవాబిచ్చింది. సరోజని తప్పు చేసినట్లు సిగ్గుతో నవ్వి, "సుగుణా,...నీతో చెపుదామని...చాలా రోజులనుంచి అనుకుంటున్నాను కానీ ఏమని చెప్పను? ఇదొక సంగతిగా నీతో చెపితే నీవేమనుకుంటావో నని చెప్పలేదు – సరే కానీ సుగుణా, నేను నీ స్నేహితురాల్ని కదా? ఒక్కమాట అడుగుతాను. నిజం చెపుతావా?" అన్నది సరోజ.

"ఏమిటి?"

"నువ్వెవర్నీ ప్రేమించలేదా సుగుణా?" అంది సరోజ. సుగుణకు ఏమి చెప్పడానికీ తోచలేదు. కొంతసేపు ఆలోచించింది. "నేను ప్రేమిస్తాననుకో, వాళ్ళు నన్ను ప్రేమించాల్సిన అవసరం లేదా సరోజా?" అన్నది.

సరోజ ఎగిరి గంతువేసింది. "చిక్కింది; దొంగ చిక్కింది. నీ మనసులో ఎవరో ఉన్నారు. చెప్పు. నిజం చెప్పు" అని సుగుణను పట్టుకుని చక్కిలిగింతలు పెట్టింది. సుగుణ సరోజని చేతుల్లోంచి తప్పించుకొని, "ముందు నువ్వు చెప్పు. తర్వాత నేను చెప్తాను" అంది

సరోజని సిగ్గుతో కొంచెంసేపు చిరునవ్వు నవ్వి "నేను చెప్పేదేముంది? నువ్వే చూచావుగా" అంది.

"ఎవర్ని"

"ఇప్పుడు కిటికీలోంచి చూచావా లేదా?"

"ఓహో" అంది సుగుణ.

"రఘు చాలా మంచివాడు. యం. బి. బి. ఎస్. చదువుతున్నాడు. వాళ్లనాన్న గుడ్డలవ్యాపారస్థుడు. రఘు రోజుకొక జాబు రాస్తాడు సుగుణా. నాకోసం ప్రాణాలైనా విడుస్తానంటాడు ఆయన రాసేజాబులు దాచిపెట్టలేక నాకు ప్రాణాలు పోతున్నాయి. మాఅమ్మా, నాన్నా ఎక్కడ చూస్తారో అని భయంతో చచ్చిపోతున్నాను. ఎలాగైనాసరే నేను రఘునే పెళ్ళి చేసుకుంటాను. పాపం నేనంటే అతనికెంత ప్రాణం అనుకున్నావు? ఆడదానికంతకంటె ఏమికావాలి సుగుణా?" అని సరోజ అమాయకంగా సుగుణకళ్ళల్లోకి చూచింది. సుగుణకు తల గిఱ్ఱున తిరిగిపోతూ ఉంది.

"సరే. నే చెప్పాగా. ఇంక నువు చెప్పు" అని సరోజ సుగుణను గుసగుస అడిగింది.

సుగుణహృదయంలో ఏదో అర్థంకాని కల్లోలం చెలరేగింది.

సుగుణ ఎంతమందినో చూస్తూనేఉంది. కానీ తన కెవ్వరూ జాబులు రాయలేదు. పక్కింటి అబ్బాయి ప్రతిదినం చూస్తూనే ఉంటాడు. కానీ ఎప్పుడైనా ఒంటరిగా కనపడ్డా, నోరు తెరిచి ఒక్కమాటైనా మాట్లాడడు. సుగుణ చాలాసేపు ఆలోచించింది. ఆమె మనోనేత్రం ముందు ఎంతమంది యువకులో వస్తున్నారు, వెళ్తున్నారు. ఆఖరున ఒకమనిషి జ్ఞాపకొచ్చాడు. సుగుణ మనసులో మిగిలిన బొమ్మలన్నీ మాయమైపోయాయి. కానీ ఆమనిషిమాత్రం సుగుణ హృదయమంతా ఆక్రమించుకొన్నాడు.

"చెప్పు" అని సరోజ తొందరచేసింది.

అమృతము వంటి

## అనంగప్రభాయాకుతి

సుందరమైన యౌవ్వనానికి. ప్రకాశవంతమైన తేజస్సుకు ఉత్తమమైనది. ధాతువును గట్టిపరచి వృద్ధిచేయును బలహీనతచెందిన నరములకు శక్తినీ, పటుత్వమును చేకూర్చును. సుఖమైన దాంపత్యజీవితమునకు ఉత్తరవాదముగలసంజీవి.

30 మాత్రలు రు. 10, 15 మాత్రలు రు. 5.

మదనమంజరి ఫార్మసీ

184, చైనాబజారు రోడు. మద్రాసు-1.

బెజవాడ-శ్రీనివాస మెడికల్ స్టోర్సు-పార్కురోడ్

రాజమండ్రి-ఈశ్వరదాస్ & కో. మెయిన్ రోడ్

నెల్లూరు:- ఆర్యన్ ఫార్మసీ-ట్రంకురోడ్.

ఇతర కేంద్రాలలో ఏజెంట్లుకావాలి

## కుష్ఠు ★ బొల్లి

వగైరా మేహమచ్చలు, సెగ, సవాయి వ్యాధులకు గ్యారంటీ చికిత్స. క్యాటలాగు ఉచితము:

సలహాకు జి. వి. రెడ్డి & కో. (రిజిష్టర్డు)

"భాస్కరాశ్రమము."

గోపాలపురం. తూర్పుగోదావరి.

# ★ సుగుణ ★

"మా చంద్రం మామయ్య" అని సుగుణ సిగ్గుతో తలవంచుకొంది.

సరోజ ఆశ్చర్యానికి అంతులేదు.

"ఓసి పిచ్చిమొద్దా...మీ చంద్రం మామయ్యకు ఎన్నేళ్ళే? పదహారేళ్ళపిల్లవు, ముప్ఫై ఏళ్ళవాణ్ని పెళ్ళి చేసుకుంటావా? ఇక పరవాలేదు. అమ్మగారు అయ్యగార్ని కట్టి పట్టుకొని నడిపించొచ్చు. ఓహో అది కాదులే, మామయ్యను పెళ్ళి చేసుకుంటే, జల్సాగా మీటింగులకు పోతూ, కొర్టుల్లో పికెట్లు కొట్టొచ్చునికదూ? నాకు తెలుసులే నీఆలోచన" అని ఎగతాళి చేసింది. సరోజని చిలిపితనానికి సుగుణ ఓర్చుకోలేకపోయింది.

"అది కాదు సరోజా, ఇంక నన్నెవ్వరూ పెళ్ళి చేసుకోకపోతే, మా చంద్రం మామయ్యకే ఇచ్చి చేస్తానని మా అమ్మ చెప్పింది" అన్నది సుగుణ.

"ఓసి పిచ్చిదానా......అయితే మీ మామయ్య ఇప్పు డెక్కడున్నాడు."

"రాయవేలూరు జైల్లో."

"ఇదుగో సుగుణా. నేను చిన్నప్పటి నుండి స్నేహితురాల్ని నా మాట విను. ఆ దేశదిమ్మరిని పెళ్ళిచేసుకొని నీవేమి సుఖపడతావు సుగుణా?"

సుగుణ కళ్లలో నీళ్లు గిఱున తిరిగాయి. సరోజ తన పమిట చెరగుతో ఆమె కన్నీరు తుడిచింది.

ఇంతలో ఎవరో ఒక ముసలాయన ఇంట్లోకి వచ్చి "ఏవమ్మ కొంతమ్మ గారూ, ఎప్పుడమ్మ పప్పన్నం పెట్టేది?" అన్నాడు.

"సుగుణా అడుగో, శేషయ్య తాత వచ్చాడు" అని సరోజ ఎగిరి గంతులేస్తూ,

"తాతయ్యా, ఇలా రా, ఇలా రా. మా సుగుణ చెయ్యి చూడు" అని ఆయన్ను సుగుణదగ్గరికి తీసుకొచ్చింది.

శేషయ్యతాత సుగుణ ఎడం చెయ్యి చూసి ముసిముసి నవ్వులు ప్రారంభించాడు.

"త్వరగా చెప్పు తాతయ్యా, సుగుణకు ఎప్పుడు పెళ్లవుతుంది? ఎంతమంది పిల్లలు?" అని సరోజ గోలచెయ్యడం ప్రారంభించింది.

"అబ్బా, ఉండమ్మా. ఎందుకంత తొందర. నేను చూస్తున్నాగా" అంటూ తాతయ్య సుగుణ చేతి వేళ్లన్నీ విరిచి విరిచి చూచాడు. సుగుణ కోపంతో ముండిపోయింది.

"అమ్మాయ్, నీకు ఈ సంవత్సరంలో తప్పకుండా పెళ్లవుతుంది. పిల్లలు ఆరు, మూడు...ఆరుగురు మొగపిల్లలు ముగ్గురు ఆడపిల్లలు" అని ముగించాడు. సరోజని విరగబడి నవ్వింది. సుగుణ మొహం మాడ్చుకుంటూ కూచుంది.

తాతయ్య ఇంకేమైనా వాగుతాడేమో, సుగుణకు ఇంకా కోపం ఎక్కువవుతుందేమోనని సరోజ గ్రహించి, "తాతగారూ, తమ జోశ్యం చాలుగాని, ఇంక బయటికి దయచెయ్యండి" అన్నది.

తాతయ్యకు రోషం వచ్చింది. "అంతా అల్లరి వ్యవహారం. చూడవమ్మా, కొంతమ్మా" అని బిగ్గరగా అరిచాడు.

కొంతమ్మ వంటయింట్లోనుంచి గబగబా వచ్చి, "ఒసే, సరోజా, ఏమిటే ఆ ముసలాయన్ను ఏడిపిస్తున్నావూ?" అని మంచి మాటలు చెప్పి తాతయ్యను పంపివేసింది.

తరవాత కోపం తగ్గించుకొని, "ఏవమ్మ సుగుణా, ఇంకా మీవాళ్లు నీ పెళ్లి సంగతి అనుకోలేదా?" అని అడిగింది.

"మీ సరోజనికి మాఘమాసంలో పెళ్ళి చేస్తారని, ఎవరో అన్నారే!" అంది సుగుణ.

"ఒసే నంగనాచీ; నీ సంగతి నే నడుగుతుంటే, సరోజని పెళ్ళి మాఘమాసంలో అంటా వేమిటే? దాన్ని ఎవరు చేసుకుంటారు? ఈ గయ్యాళిపిల్ల ఎవరి పాలబడుతుందో గాని, దీన్ని కట్టుకున్నవాడు, బైరాగుల్లో కలిసిపోవాలసిందే" అంది కొంతమ్మ చిరునవ్వుతో.

సరోజ విరగబడి నవ్వి, సుగుణకు చక్కిలిగింతలు పెట్టి నవ్వించింది.

"వస్తానమ్మా. పొద్దు పోయింది" అని సుగుణ ఇంటికి బయలుదేరింది. "సరేనమ్మా" అని సరోజ సుగుణను వెక్కిరించి కిలకిల నవ్వింది. సుగుణ కుంటికాలుతో ఊగుతూ నడుస్తూంటే, సరోజని అవైపే చూస్తూ నిలుచుంది. సముద్రుని అలలధాటికి తట్టుకోలేక, భారంతో అటూ ఇటూ ఊగే నావలాగా, యౌవనభారాన్ని మోయలేక మోస్తూ, కుంటి సుగుణ ఇంటికి వెళ్లింది.

## 5

యుద్ధం ముగిసింది.

దేశమంతటా సమ్మెలు పోరాటాలూ చెలరేగాయి. వెల్లువలా పొంగి వ్యాపిస్తున్న ప్రజోద్యమాన్ని అరికట్టడానికి బ్రిటిషు ప్రభుత్వానికి చేతకాలేదు.

"మీకు స్వాతంత్ర్యం ఇచ్చేస్తున్నాం" అని ప్రకటించి రాజకీయ ఖైదిల నందర్నీ విడుదలచేయడం ప్రారంభించారు.

ప్రజల్లో ఏదో నవచైతన్యం కనిపించసాగింది.

చంద్రశేఖరం విడుదలై వచ్చాడని తెలియగానే రాఘవయ్యా శేషమ్మా సుగుణా, చాలా సంతోషించారు.

వస్తాడు, వస్తాడు అని ఎంతో ఆసక్తితో అందరూ ఎదురుచూచారు.

ఒకరోజు ఉదయం రానేవచ్చాడు. శేషమ్మ తమ్ముణ్ణిచూచి ఆశ్చర్యపోయింది.

పూర్తిగా మారిపోయాడు చంద్రం. రాఘవయ్యగారికి నోటివెంట మాటే రాలేదు.

చంద్రం పకపకా నవ్వి "ఏంబావా, ఎందుకలా చూస్తారు. ఏమిటి మీరు? అప్పుడే ఇంత ముసలాళ్లయిపోయారే!" అని చిరునవ్వు నవ్వుతూ, సుధాకరుణ్ణి దగ్గరికి తీసుకొన్నాడు. వాడి బుగ్గలు నిమురుతూ "అమ్మో, మీరందరూ ఎంతమారిపోయారు?" అని సుధాకరుణ్ణి రెండు చేతులతో తీసుకొని తొడపై కూర్చోబెట్టుకొని సంసార జీవితానికి వాచిపోయినమనిషిలా ఏదో ఆవేదన పడ్డాడు.

శేషమ్మ తమ్ముణ్ణి అట్టే కొంతసేపు చూచి, ఇంట్లోకివెళ్ళి చెరగుతో కన్నీళ్లు అద్దుకొంది. "అబ్బే, సుగుణకీ ఈడు కాదు" అని మనసులోనే అనుకొంది. సుగుణ తలుపు చాటునచేరి మామయ్యను తనివిదీరా చూచింది. "అమ్మో. నిజంగా మామయ్య చాలా పెద్దవాడులాగా కనపడుతున్నాడే! పాపం జైల్లో బాధలు పడిపడి యిలా అయిపోయి ఉంటాడు" అనుకొంది. ఇంతలో రాఘవయ్య "సుగుణా, కొంచెం కాఫీ పెట్టి తీసుకరామ్మా, మీ మామయ్యకు" అన్నాడు.

చంద్రం నవ్వి "ఏదీ సుగుణ ఇంట్లోనుంచి బయటికే రాలేదే" అన్నాడు.

సుగుణకు గుండె దడదడ కొట్టుకుంది. రివ్వున వంటయింట్లోకి పరుగెత్తింది.

"చూచావా మీ మామయ్యను" అని అడిగింది అమ్మ. సుగుణ చిరునవ్వు నవ్వి మౌనంగా కూచుంది.

"నేను ఖచ్చితంగా చెపితే, వాడు కాదనడు. కానీ, చాలా పెద్దవాడులాగా కన్పిస్తున్నాడు. ఏం సుగుణా! నీకిష్టమేనా?" అని అమ్మ అడిగింది. సుగుణ జవాబు చెప్పకుండా, చిరునవ్వు నవ్వుతూ, కాలిగోళ్లు గిల్లుకుంటూ కూచుంది.

రెండులోటాల్లో కాఫీపోసి, "ఇచ్చిరాపో" అని అమ్మ ఆజ్ఞాపించింది.

సుగుణ నవ్వుతూ అమ్మకళ్ళల్లోకి చూచి, "నువ్వే ఇచ్చిరామ్మా" అని వేడుకుంటున్నట్లు చెప్పింది.

"పరవాలేదుపోవే, ఎందుకంత సిగ్గు? వాడేమి పరాయివాడా?" అని తల్లి బలవంతం చేసింది.

# ★ సుగుణ ★

ఇక విధిలేక రెండు లోటాలు కాఫీ తీసుకొని, అడుగులో అడుగు వేసుకుంటూ, బావకు ఒకలోటా అందివ్వబోయింది.

"ముందు మీ మామయ్య కియ్యవమ్మా" అంటూ రాఘవయ్య, ఒకలోటా అందుకున్నాడు.

చంద్రం మెల్లగా కనురెప్పలు పైకెత్తి, ఆశ్చర్యంతో ఆవేదనతో సుగుణను చూస్తూ, కాఫీ అందుకున్నాడు.

సుగుణ ఇంక క్షణంకూడా అక్కడ నిలవకుండా ఇంట్లోకి పరుగెత్తింది. తన ముల్లెంతా మునిగినట్లు గుండె ఎందుకో దడదడ కొట్టుకుంటూంది.

సుగుణ ఎంత గాభరాపడిందో, చంద్రం అంతకంటె ఎక్కువే గాభరాపడ్డాడు. స్త్రీ స్పర్శ ఎరుగని మగవాడు, ఒక అందమయిన యువతి తనను గౌరవిస్తుంటే ఎంత త్రొటుపడతాడో, అటువంటి అనుభూతినే చంద్రం ఆ క్షణంలో అనుభవించాడు.

కాఫీ చప్పరించి, రాఘవయ్య, "నిజంగా, మనుషులంటే మీరేనోయ్" అన్నాడు.

చంద్రం, నవ్వి "ఏం, బావా? ఎందుకలా అంటున్నావ్" అన్నాడు.

"ఎట్లాఅయితే ఏం? స్వరాజ్యం సాధించారుగా! నిజంగా ధీరులలక్షణమే అది. ఎన్నికష్టాలొచ్చినా, అనుకొన్న పని సాధిస్తారు" అన్నాడు బావ.

"ఏం సాధించడం బావా!...ఇప్పటికి ఏమైనట్లు? అధికారం మనవాళ్ల చేతికి వచ్చినంత మాత్రాన, మనకు ఒరిగేదేముంది?" అని చంద్రం కాఫీ గుక్కెడు చప్పరించాడు.

"అదీ నిజమే." అన్నాడు రాఘవయ్య.

"అధికారం ఒకరిచేతుల్లోంచి, ఇంకొకరిచేతుల్లోకి మారినంత మాత్రాన ఏమీ లాభం లేదు." అని చంద్రం కాఫీతాగడం పూర్తిచేసి, కిటికీవైపు చూచాడు. ఆ కిటికీలోంచి రెండు కళ్లు తనను చూస్తూనే ఉన్నాయని ఆయనకు బాగా తెలుసు. సుగుణ కూడా మామను తనివితీరా చూచింది. మామ చూచిన చూపులో ఏమి అర్థం ఉందో కానీ, "సుగుణా నేను నీ కిష్టమేనా?" అన్న మాటలు చంద్రం చూచిన చూపులో సుగుణకు స్ఫురించాయి.

"వస్తా బావా; వర్కింగ్ కమిటీ సమావేశానికి బెజవాడ పోవాలి" అన్నాడు చంద్రం.

"ఏమిటి చంద్రం! ఇంకా ఏమి సమావేశాలురా? పోదుగానిలే. భోంచేసి పోగూడదూ?"

"కాదు బావా. నిన్ననే పోవాల్సింది. మిమ్మల్ని చూచి చాలా రోజులయింది. ఇంక ఎప్పటికి చూస్తానో అని వచ్చాను."

మామయ్య వెళ్లిపోతున్నాడని సుగుణ అప్పుడే అమ్మకు చెప్పేసింది.

శేషమ్మ పరుగెత్తుకుంటూ వచ్చి, "ఏమిట్రా, మరీ విచిత్రంగా ఉంది! మరేం మునిగిపోయిందేమీ లేదులే, భోంచేసి పోవచ్చు" అని ఖచ్చితంగా చెప్పింది.

"కాదమ్మా. తప్పకుండా వెళ్ళాలి. వస్తాగా మళ్ళీ" అని చంద్రం అక్కగారి మాటలు విన్పించుకోకుండా వెళ్ళిపోయాడు.

## 6

కొన్ని సంవత్సరాలు చంద్రం మళ్ళీ రాఘవయ్యగారి ఇంటి కడప తొక్కనే లేదు.

ఇంటి యజమాని ఒకనాడు రాఘవయ్యను పిలిచి, "ఏమయ్యా రాఘవయ్యా, మీ బావమరది కమ్యూనిస్టు పార్టీలో చేరాడే" అని హేళనగా అన్నాడు. రాఘవయ్య ఆశ్చర్యపడ్డాడు.

ఒకనాడు రాత్రి పన్నెండుగంటలప్పుడు ఎవరో తలుపు తట్టారు.

రాఘవయ్య తటాలున లేచి, గడగడ వణకుతూ తలుపు తీశాడు. రివ్వున చలిగాలి లోపలికి కొట్టింది. చంద్రం మెల్లగా లోపలికొచ్చి తలుపు వేశాడు. చలికి గడగడ వణకుతూ రాఘవయ్య మాట్లాడలేకపోయాడు.

ఇంతలో సుగుణ లేచి, అమ్మను లేపి "అమ్మా, మామయ్య వచ్చాడు" అని గుసగుస చెప్పింది.

సుధాకరుడు లేచివచ్చి మామయ్యదగ్గర కూచొని విచిత్రమైనజంతువును చూచినట్లు చూచి, "అమ్మా, మామయ్య తడిసిపొయ్యాడే" అని "మామయ్యా, తలతుడుచుకొంటావా?" అని తుండుగుడ్డ తీసుకొచ్చి యిచ్చాడు.

చంద్రం, సుధాకరుడిచేతిని ఒకసారి ముద్దుపెట్టుకొని, తల తుడుచుకొనడం ప్రారంభించాడు.

"సుగుణా, పెట్లో పంచె ఏమైనా ఉందేమో చూడు" అని రాఘవయ్య అన్నాడు.

"వద్దుబావా, వద్దు. నాకు గుడ్డలున్నాయి. ఇప్పుడవసరంలేదు సుగుణా" అన్నాడు చంద్రం.

పెట్లో పంచెలేదని సుగుణకు తెలుసు. అందుకని ఆమె కదలకుండా కూచుంది.

"ఏమిటి చంద్రం, మళ్లీ కమ్యూనిష్టు పార్టీలో ఎందుకు చేరావురా?" అన్నాడు రాఘవయ్య.

"చేరవలసివచ్చింది బావా, పరిస్థితులు అలా మారిపోయాయి" అన్నాడు చంద్రం.

"అదికాదు. స్వరాజ్యం కావాలన్నారు; జైళ్లకుపోయారు; బాగానేఉంది. స్వరాజ్యం వచ్చేసిందికదా! ఇంకా ఎందుకు అవస్థలు పడడం?" అన్నాడు బావ.

"అవస్థలేమున్నాయిబావా? ఎవరికంటె ఎక్కువ అవస్థపడుతున్నాను నేను?" అని చంద్రం చిరునవ్వు నవ్వాడు.

"బాగానే ఉంది వేదాంతం" అన్నాడు బావ.

"వేదాంతం ఏముంది బావా? ఈనాడు సమాజం మారాలి. ఈ ఆర్థికవ్యవస్థ మారితేనే గాని అందరూ సుఖపడడం అనేది కల్ల. అలా మార్చడం ఈ ప్రభుత్వాలవల్లకాదు" అన్నాడు చంద్రం. అతని ముఖం కోపంతో కందిపోయిందని, ఆ గుడ్డి వెలుతురులోగూడా రాఘవయ్య గ్రహించాడు.

చంద్రం బయలుదేరాడు; సుగుణ, శేషమ్మ, ఒక్కసారి గాభరాపడ్డారు.

"రేపుపొద్దున పోగూడదటరా? ఇప్పుడే, ఈ వానలోనే ఎక్కడికిపోవాలి?" అని శేషమ్మ కోపంతో, అడిగింది.

"పోవాలక్కయ్యా. ఈరోజు రాత్రి ఇక్కడే ఉన్నానంటే, రేపు పొద్దున సంకెళ్లు తప్పవు" అన్నాడు. అందరూ నిశ్చేష్టులై కూచున్నారు.

చంద్రం, తలుపుతీసుకొని, చీకటితో పోరాడడానికి వెళ్తున్నట్లు ఆ గాఢాంధకారంలో కలిసిపోయాడు. గాలి రివ్వున వీచి, అతణ్ణి త్రోసుకుంటూ వెళ్ళిపోయింది.

సుగుణకు మామయ్యమీద పట్టరానికోపం వచ్చింది. "ఈ మనిషిని, మా యింటికి రమ్మని ఎవరుపిలిచారు.? రానివాడు రాకుండానే ఉండకూడదూ? వట్టి మొరటుమనిషి" అని మనసులోనే అనుకొని సుగుణ ఊరుకుంది.

[ఇంకావుంది]

కేశవృద్ధికిని, అకాల నెరియుట ఆపుటకు
కాష్మీర్ - కుసుమం
మీ ఇష్టమైన నూనెలో నానవేయండి
యునైటెడ్ కన్సర్న్, బందరు వీధి, మద్రాసు-1. విజయవాడ.
నిరపాయకరమైన
నంజనగూడు పండ్లపొడి
ఇతర 54 ఔషధముల జాబితా ఉచితము



పెద్దకథ

# సుగుణ

జి. సి. రామకృష్ణ

## 7

ఏ ఆశా లేనిదే మనిషి ప్రపంచంలో బ్రతకలేడు. రాఘవయ్యగారి దగ్గర చిల్లిగవ్వయినా లేదు. 'కట్నీదారుల్ని నలుగుర్ని బ్రతిమాలుకుంటే ఏదైనా సహాయం చేయకుండా పోతారా' అని రాఘవయ్యగారి ఆశ. ఎన్నో మనువులు విచారించి, విసిగిపోయాడు ఆయన.

పిల్లను చూచినవాళ్లందరూ, ఆమె ముఖం చూచి సంతృప్తిపడేవాళ్లే. కానీ ఆ కుంటికాలు చూడంగానే చాలా బాధపడేవారు. పెండ్లిచూపులకోసం వచ్చేపోయే వాళ్లకు కాఫీ ఫలహారాలు సప్లయిచేయడానికి మొత్తంమీద రెండువందల రూపాలకు పైగానే ఖర్చయింది.

ఒకనాడు సరోజని తండ్రి రామారావుగారు, శుభలేఖలు పట్టుకొచ్చి, సరోజనికి పెళ్లి నిశ్చయమయిందనీ అందరూ రావలసిందనీ ఆహ్వానించి వెళ్ళిపోయాడు.

సుగుణ ఆసక్తితో శుభలేఖ పట్టుకొని చూచింది. వరుడు వెంకటేశ్వర్లు అని అచ్చువేసిఉంది. సుగుణ ఆశ్చర్యానికి అంతు లేదు. సరోజని రఘును తప్ప ఈలోకంలో ఇంకెవర్నీ పెళ్ళిచేసుకోనని తనతో ఎన్నోసార్లు చెప్పింది. కానీ ఈ వెంకటేశ్వర్లు ఎవరో?

సాయంత్రం సరోజని ముచ్చటగా ముసిముసి నవ్వులు నవ్వుకుంటూవచ్చింది. ఏదో పట్టరాని ఆనందం ఆమె ముఖంలో తొణికిసలాడుతూ ఉంది. సుగుణ సరోజనిని సంతోషంగా ఆహ్వానించి, "ఏమిటి సరోజా! ఈ వెంకటేశ్వర్లు ఎవరు?" అని అడిగింది.

"ఆయన మా నాన్నగారి ఆఫీసులో హెడ్ గుమాస్తాగారి కుమారుడు. నీవు చూడలేదు కానీ, అచ్చంగా అశోక్‌కుమార్ లాగా ఉంటాడు" అంది సరోజ. సుగుణకు ఏం మాట్లాడాలో తోచలేదు. "అయితే రఘు ఏమైపోయాడు?" అంది మెల్లగా.

"ఏమో వాడు ఈమధ్య కనిపించడం లేదు. పాపం ఎక్కడికిపోయాడో. ఆయన రాసిన జాబులన్నీ పొయ్యిలో వేశాను. ఏం చేసేది సుగుణా?" అని పశ్చాత్తాపంతో చూచింది.

ఇంతలో శేషమ్మ సరోజనిని చూచి బలవంతంగా నవ్వు తెచ్చుకొని—

"ఏవమ్మా సరోజా, పెళ్లి అయితే మా యిల్లు నీకు కనిపిస్తుందో కనిపించదో?" అన్నది.

"నా కేమీ కళ్ళు జబ్బు లేదమ్మా. ఖర్మం చాలకపోతే పెళ్లిఅయిన తర్వాత వస్తే రావచ్చు" అని కిలకిల నవ్వింది సరోజ.

"నీవు రావాలనుకున్నా, మొగుడు రానిస్తాడా? ఎవరి జంజాటంలో వాళ్ళు పడ్డ తర్వాత, ఒకరి సంగతి జ్ఞాపకంఉంటుందా" అని శేషమ్మ చిరునవ్వు నవ్వింది.

"రాకుండా ఎందుకుంటానమ్మా. మావారికి ఈవూరి పోస్టాఫీసులోనే ఉద్యోగం, మీకోసం రాకపోయినా, సుగుణను చూడ్డానికైనా వస్తాను" అంది సరోజ.

సుగుణకళ్లు కృతజ్ఞతతో చెమ్మగిల్లాయి. పెళ్ళికి అందరూ తప్పకుండా రావాలని, అందర్నీ ఆహ్వానించి సరోజ వెళ్లిపోయింది.

రాత్రులూ పగళ్లూ ఎన్నో గడచిపోతూనే ఉన్నాయి.

"ఈ కుంటిపిల్లను నేను పెళ్ళి చేసుకుంటాను" అని ధైర్యంగా చెప్పగల మగవాడెవ్వడూ కనిపించలేదు.

నిరాశ సుగుణ హృదయాన్ని కబళించి

# ★ సుగుణ ★

చేసింది. తన మనసులో ఉన్న ఆవేదనలను తెలుసుకొని సానుభూతి చూపే వారు లేనప్పుడు, ప్రతిమనిషికీ నిరాశ కలగడం సహజం.

సరోజనికి పెళ్లిఅయి ఆరునెలలు గడిచిపోయాయి.

ఒకనాడు సరోజని శుభ్రంగా అలంకరించుకొని, సుగుణ దగ్గరికి వచ్చింది. సరోజని పూర్తిగా మారిపోయింది. దాంపత్య జీవితం ప్రతిమనిషినీ మార్చివేస్తుంది. ఏదో కొత్త అందంతో సరోజని మెరిసిపోతూ ఉంది.

శేషమ్మ సరోజనిని తనివితీరా చూచి పకపకా నవ్వి "ఆ. తెలిసిందిలే. అలా ఉండాలి" అన్నది.

సరోజ చిరునవ్వు నవ్వుతూ "ఏమిటమ్మా, తెలిస్తే చెప్పరాదూ?" అన్నది.

"నా నోటితోనే చెప్పించాలా?" అన్నది శేషమ్మ. సరోజని కిలకిలా నవ్వింది.

"ఎన్నో నెల సరోజా!" అన్నది శేషమ్మ.

"ఏమోపోమ్మా. లేనిపోనిపీడ. మూడో నెల" అని సరోజని విసుగుతో నవ్వుతూ చెప్పింది. సుగుణ ఆశ్చర్యంగా ఇద్దరి ముఖాలూ చూస్తూ కూచుంది.

శేషమ్మ ఏదో పనిమీద వెళ్ళిపోయింది.

సరోజ సుగుణకు దగ్గరగా కూర్చొని, "ఏంసుగుణా మీ మామయ్య ఏమన్నాడు?" అన్నది. సుగుణ హృదయం ఒక్కసారిగా నిరాశతో మండిపోయింది. "ఏళ్లో చూక మన్నాడు" అన్నది.

"ఎందుకు సుగుణా అంతకోపం? నీవు పెళ్లి కాలేదనీ నీవు దిగులుపడాల్సిన అవసరం ఏముంది చెప్పు? నిజంగా మనం పెళ్ళి కాలేదు, కాలేదు అనుకుంటాంకాని, ఆ తొందర పెళ్లి అయ్యేంతవరకే. తర్వాత యథాప్రకారంగానే ఉంటుంది. అన్నిటికీ అలవాటైపోతాం" అన్నది సరోజ.

సుగుణ మెల్లగా నవ్వింది.

"ఏంచేసేది సరోజా. ఎంతసేపటికీ, మా అమ్మా నాన్నా, నా సంగతే ఆలోచిస్తూ ఉంటారు. వీళ్ళకి నేను లేనిపోని బెడదైపోయానే అని నా దిగులు. అంతేగాని, పెళ్ళికావాలనీ, ఏదో బావుకుందామనీ నాకు ఏకోశానా లేదు. సరోజా, నీకంటె నాకు ప్రాణస్నేహితు లెవ్వరూ లేరు. నీతోమాత్రమే చెపుతున్నాను. నేనింక బతకలేను సరోజా. నేను వెళ్ళిపోతే నే అందరికీ హాయిగా ఉంటుంది" అని సుగుణ సరోజని భుజానికి ఆనుకొని కన్నీరు నించింది. సరోజ సుగుణ కన్నీళ్లు తుడిచి, మెడచుట్టూ చేతులు వేసి, గాఢంగా కౌగలించుకొని, "సుగుణా, నే నిప్పుడు తటాలున మగవాణ్ణయిపోతే, నీ కెలా ఉంటుంది చెప్పు?" అని పకపకానవ్వింది.

అంత దుఃఖంలోగూడా సుగుణకు నవ్వు త్రోసుకొని వచ్చింది.

జోరున వర్షం కురిసిన తర్వాత మబ్బుల వెనుక దాక్కున్న చంద్రుడు మేఘాల పత్తిడి తప్పించుకొని బయటపడి ప్రకాశించినట్లుంది సుగుణ నవ్వు.

## 8

కాలం గడిచేకొద్దీ, దేశంలో ఎన్నో మార్పులు జరిగాయి. కానీ రాఘవయ్యగారి దారిద్ర్యంలో మాత్రం ఏ మార్పూ రాలేదు.

ఒకనాడు రాఘవయ్య ఆందోళనతో గబగబా యింట్లోకి వచ్చి, ఏదో గాఢంగా ఆలోచిస్తూ కూచున్నాడు.

"ఏమిటండి?" అని భార్య ఆసక్తితో అడిగింది.

"మన చంద్రం, ఎక్కడున్నాడో!... కమ్యూనిస్టుల్ని కాల్చిపారేస్తున్నారని చాలమంది అంటున్నారు. తెలంగాణాలో, కృష్ణా జిల్లాలో, దినానికి ఇద్దరో ముగ్గురో ఎగిరిపోతున్నారు" అని కృంగిపోతూ అన్నాడు రాఘవయ్య.

"అయితే మీ దెక్కడున్నదీ ఎవ్వరూ అననే లేదుకదూ" అని శేషమ్మ ఆవేదనతో అడిగింది.

"ఎవరికి తెలుస్తుంది? అసలు తెలిసినా చెప్పరు."

"అయితే కాల్చెయ్యడం ఎందుయ్యా?" అని శేషమ్మ,అమాయకమైన ఆందోళనతో అడిగింది.

"ఆ, ఏముంది? అసలు గవర్న మెంటుతోనే కమ్యూనిస్టు పార్టీవాళ్ళు జగడం పెట్టుకొని పోరాడుతున్నారు. ఇక కాల్చెయ్యక ఎలా ఊరుకుంటారు?" అన్నాడు రాఘవయ్య.

సుగుణ చాటుకుపోయి, కళ్ళనీళ్ళు తుడుచుకొంది. శేషమ్మ, జలజల కారుతున్న కన్నీరు ఆపడానికి శక్తిలేక గిజగిజలాడుతూ విలపించింది.

ఒకరితో ఒకరు ఎందుకు పోరాడుతోనాలో, ఈ రాజకీయాలేమిటో, ఆ అమాయకులైన ఆడవాళ్లకు తెలీదు. దుఃఖం వస్తే కన్నీరు కార్చటం, సంతోషం కలిగితే చిరునవ్వులు నవ్వటం మాత్రమే వాళ్లకు తెలుసు.

దినమొక యుగంగా అష్టకష్టాలతో కాలం వెళ్ళబుచ్చేవాళ్ళకి, ఇక రాబోయే రోజులు, ఎంత భయంకరంగా ఉంటాయోనని తీవ్రమైన ఆందోళన, నిరాశ కలుగుతూ ఉంటాయి.

రాఘవయ్యగారి కుటుంబం, అటువంటి నిరాశాసముద్రంలో మునిగిపోయింది.

సుగుణ ముఖంలో కాంతి క్రమంగా తగ్గించిపోయింది. చెంపలు, ముక్కలన్నీ ఊడిపోయి, పిచ్చిదానిలాగా తయారయింది.


# బహిష్టు ఆగినదా?




ఎంతకాలంనుంచి ఏ కారణంవల్లనైనా నిలిచిపోయిన బహిష్టు నైనను దేవీపిల్సు తిరిగి అపాయంలేకుండ క్రమపరచును. ఇండియా గవర్నమెంటు (పి డి ఎల్ /188) సెంట్రల్ డ్రగ్సు లేబొరేటరీ క్రింద రిజిష్టరుచేయబడినది. ఇది గ్యారంటీ ఔషధము. అనేక యోగ్యతా పత్రములు కలవు. నకిలీ మందుల బారి పోవద్దు. సాధారణ కేసులకు ఖరీదు రు. 8-8-0. నెలలుగా నిలిచిపోయిన కేసులకు రు. 10-8-0. వి. పి. పి. ప్రత్యేకం.

# సంతాన నిగ్రహం




స్పెక్ పిల్సు రిజిష్టరు నెం. 266. గ్యారంటీ ఔషధము. 12 రోజులు సేవించిన 6 సంవత్సరాల వరకు శాశ్వతంగా గర్భము కలుగదు. మామూలుగా బహిష్టుకు భంగం కలిగించదు. ఇతర నకిలీ మందుల బారి పోవద్దు. అనేక యోగ్యతాపత్రములుకలవు. ఖరీదు రు. 12/-లు. వి.పి.పి. వేరు.

**SEENU & Co., P. B. No. 1638 ( ) Madras-1.**

బ్రాంచీలు: సింగపూరు, కౌలాలంపూర్. ఏజంట్లు: సిలోన్, రంగూను.

ప్రాతినిధ్యంలేని తావులలో ఏజంట్లు కావలెను.

## సవరణ

గత వారం సంచికలో "ప్రమాదవశాత్తు మరణించింది" అనే కథ వ్రాసిన వారు కొంతి రామమూర్తి అని గాక కొంతి కృష్ణమూర్తి అని పాఠకులు గ్రహించవలెనని కోరుచున్నాము. సం॥

వయసెక్కువయేకొద్దీ, యవ్వనపు లావణ్యం తగ్గిపోయింది.

ఒకనాడు సుగుణ సుధాకరుడితో ఏదో మాట్లాడుతూ కూచొని ఉంది.

"గంగమ్మలాగా కూచోకపోతే నీళ్ళు పోసుకొని జడవేసుకోరాదూ? అవికూడా ఒకరు చెప్పాల్నా?" అని శేషమ్మ, మటమటలాడుతూ చెప్పింది.

సుగుణ ఆశ్చర్యంతో తల్లివైపు దీనంగా ఒకసారి చూచి, లేచి, స్నానం చేసి, జడ వేసుకొని ఒకమూల కూచుంది.

అమ్మ, నాన్నా, ఏదో మాట్లాడుకుంటున్నారు.

"ఇంత నిర్లక్ష్యంగా ఉంటే ఎలాగండీ, పెద్దమనిషయిన పిల్లను ఎన్నాళ్లు ఇంట్లో పెట్టుకుందామని మీ ఉద్దేశం? దాని ఈడువాళ్లు బిడ్డలతల్లులవుతున్నారు."

"నేనేం చేసేది చెప్పు? కనపడ్డ వాళ్లందర్నీ విసుగులేకుండా అడుగుతూనే ఉన్నాను. ఆఖరికి మన బతుకు ఎగతాళిగా మారిపోయింది"

"ఒకలేదో అన్నారని మనం ఊరుకుంటే ఎలా చెప్పండి? మన తంటాలు మనం పడాల్నా పనిలేదా? ఎవడికో ఒకడికి ముడిపెట్టేస్తే సగం దిగులు తీరిపోతుందను కుంటే ఆరోజు వచ్చేట్టు లేదు"

"మొన్న బృందావనంలో వెంకటసుబ్బయ్యగారి కుమారుణ్ణి చూచి వచ్చాను. కుంటిపిల్ల అయినాసరే, చేసుకుంటానన్నాడు. షుమారు ముప్ఫయివేలుంటయి"

"అయితే అయింది, పిల్లను చూచిపొమ్మని చెప్పకూడదూ?" అన్నది అమ్మ.

సంభాషణవింటున్న సుగుణ, ఆ క్షణంలోనే, వెంకటసుబ్బయ్యగారికీ, ఆయన కుమారుడికీ, పదివేల నమస్కారాలు పెట్టింది. రంగనాయకస్వామికి లక్షప్రణామాలు అర్పించింది.

మళ్ళీ నాన్న ఏదో అంటున్నాడు.

"వాడికి ఎక్కడలేని రోగాలు. వతిముండలముంతాకోరట" అన్నాడు.

"లేనిపోనివి ఎవరు చెప్పారయ్యానీకు?" అని శేషమ్మ కస్సుమని అడిగింది.

"ఎవరో చెప్పాల్నా? మనిషిని చూస్తే తెలీదా? అయ్యగారిసంగతి తెలిసే ఎవ్వరూ పిల్లనివ్వలేదట" అన్నాడు నాన్న.

"ఏమైనాగానీ రేపు పిలుచుకరాండి చూస్తాం. ఈ బెడద వదిలించుకుంటేనే గానీ, నాకు నిద్రపట్టేట్టు లేదు" అని మూర్ఖంగా అన్నది తల్లి.

"నాన్నా, నన్ను వాడికిచ్చేబదులు, గొంతు కోసెయ్యండినాన్నా" అని నాన్న కాళ్లు పట్టుకొని ఏడవాలి అనుకొంది సుగుణ; కానీ ధైర్యంచాలక, లోలోపలే ఏడ్చి కన్నీరు తుడుచుకొంది.

## 9

తనకింక పెళ్లికాదని సుగుణ నిర్ధారణ చేసుకుంది. కానీ ఎంత స్థిమితంగా ఉండాలనుకున్నా, మనసులో ఏదో సంచలనం కలుగుతున్నది.

గాఢాంధకారంలో కొన్ని మైళ్ళ దూరాన సన్నగా చిన్నవెలుగు కనిపిస్తే ఎంత ఆనందం కలుగుతుందో, చంద్రం మామయ్య జ్ఞాపకానికి వస్తే సుగుణకు అంత ఆనందం కలిగేది.

మూర్ఖుడు! పశువు! నిజంగా మనిషే అయితే, దేశాన్ని ఉద్ధరించాలని ఊళ్లమీద తిరుగుతాడా? తన మంచికోసేవాళ్లందర్నీ వదిలి, ఎక్కడికో పారిపోతాడా? నిజంగా చంద్రంమామయ్య హృదయం కలవాడే అయితే, ఇక్కడొక దిక్కులేని పిల్ల, తనకోసం రాత్రింబవళ్ళు కుమిలిపోతూ ఉందని, తెలుసుకోకుండా ఉంటాడా?

ఒట్టి, పిచ్చిగానీ; కమ్యూనిస్టుపార్టీలో చేరి పదిమందిలో తిరిగేవాడు, కుంటిదాన్ని పెళ్ళి చేసుకోడానికి ఆయనమాత్రం ఎలా ఒప్పుకుంటాడు? ఈసారి యెప్పుడైనా వస్తే తెగించి, అడిగెయ్యాలి "మామయ్యా నేనంటే, ఇష్టంలేదా నీకు? నన్ను పెళ్లి చేసుకొని, మా అమ్మకూ, నాన్నకూ, కష్టాలు తప్పించు మామయ్యా" అని కాళ్ళు రెండూ పట్టుకొని అడిగితే, కాదంటాడా? అంతగా అయితే, "మామయ్యా నీతో కూడా వస్తాను. నువ్వెక్కడుండమంటే అక్కడుంటాను." అని వేడుకొంటే, మామయ్య ఎందుకు కాదంటాడు? అనడు. మా చంద్రం మామయ్య అంత రాతిగుండె వాడు కాదు. మామయ్య పెద్దవాడైతే మాత్రం ఏం? ఎంతో బాగుంటాడు. అంతకంటే మంచి మనసున్న వాడు ఇంకొకడు దొరుకుతాడా?...ఏమో! ఎవరి మనసుల్లో ఎంతెంత ఉందో ఇంకొకరికి ఎలా తెలుస్తుంది? మామయ్యకు ఇంకెవరయినా ఆడవాళ్లున్నారేమో! అంతగా కావాలనుకుంటే, మగవాడికి ఆడవాళ్లే దొరక్కుండా పోతారా? లేకపోతే ఇంతకాలం పెళ్లిచేసుకోకుండా మగవాడు ఉండగలడా?

ఛీ. ఛీ. చంద్రం మామయ్య అలాంటివాడు కానేకాదు. అయితే, మామయ్యకి నామీద యిష్టం లేకుంటే, ఒకసారి కాఫీ ఇచ్చేటప్పుడు ఏదో అదోక విధంగా చూచేడే? ఏదో కోరిక లేకుంటే అలా ఆశగా చూస్తాడా? ఇంతకూ, మామయ్యకు కాళ్ళేకాలేమో? లేకుంటే, ఇన్నాళ్ళు రాకుండా ఉంటాడా?"

సుగుణ భుజంపైన తటాలున ఎవరో చెయ్యి వేశారు.

"ఎవరు?" అని ఉలిక్కిపడి లేచింది సుగుణ.

"అక్కయ్యా, ఏమిటి, కలవరిస్తున్నావ్?" అన్నాడు సుధాకర్.

"కలవరించానా? లేదే!" అన్నది

(49-వ పేజీ చూడండి)


## డాన్‌క్విక్ సెట్

వెల రెండురూపాయలు

పోస్టుఖర్చులు ప్రత్యేకం

ఆంధ్రగ్రంథమాల, మద్రాసు-1.

ఒక గంటలో యౌవ్వనము

కామస్తంభన

ధాతుపుష్టి, సంసారసుఖము నిచ్చుటలో సాటిలేనిది నిరాశచెందిన వృద్ధులయందు శక్తి ఉత్సాహము నిచ్చును. రు. 2-8-0.

మదనమంజరి ఫార్మసీ

184, చైనాబజారు రోడు. మద్రాసు-1.

బెజవాడ-శ్రీనివాస మెడికల్‌స్టోర్సు-సార్థురోడ్

రాజమండ్రి-ఈశ్వరదాస్ & కో. మెయిన్‌రోడ్

వెల్లూరు:- ఆర్యన్ ఫార్మసీ-ట్రంకురోడ్.

ఇతర కేంద్రాలక్లో ఏజెంట్లుకావాలి

## మొగలి పొట్లము

15 రేకుల పొట్లము—15 కీర్తికల సంపుటి

మంజుల పరిమళముసునిసిత హాస్యము.

రచయిత్రి:

కె. లక్ష్మీరఘురామ్.

వెల: రూ. 1-0-0

దొరకు స్థలము:—

55, Harrington Road,

Chetput : : Madras.

లేక హిగిన్ బాదమ్స్ పుస్తక దుకాణములలో

# కాలక్షేపం ★

(5-వ పేజీ తరువాయి)

"హర! హర! మహదేవ్!" అని యిస్తారు గాని "పూజారికీ జై!" అని యివ్వరు.

ఈ రోజున ఒక విధమైన విశ్వాసం ప్రభుత్వవర్గం యెడల ఉన్నదంటే, ఆ ప్రభుత్వవర్గం ఒకపార్టీ రథంమీద కూర్చున్నదన్న కారణంచేతనే గాని, మరొక కారణంవల్ల కాదు. అయితే, ఆపార్టీఅనేది ఒక ధర్మమునకు కట్టుబడి ఉండాలి. ఆ ధర్మమే ఆ రథాన్ని లాగుతుంది. అదే దానికి పెట్రోలు. అటువంటిస్థితిలో ప్రభుత్వవర్గంలో విశ్వాసం మనకు ఉన్నదంటే, అర్థమేమిటి? ఆ ప్రభుత్వవర్గము కూర్చున్నటువంటి కారులో పెట్రోల్ సమృద్ధిగా ఉండాలి. ఆ పెట్రోలు బలంతో అది నడవాలి. ప్రభుత్వానికి ఎలెక్టరల్ రోల్ బలం ఉంటే అదే వారి కారుకు ఉండవలసిన పెట్రోల్ బలం. ప్రభుత్వ రథం సాగదు అనే అపనమ్మకము ఎప్పుడు కలుగుతుందో అదే అవిశ్వాసం. ఎలెక్టరలు రోల్ బలం ఎంత ఉన్నదో పరీక్షించాలి. ఆంధ్రరాష్ట్ర ప్రభుత్వపు శకటం కర్నూలులో నడవడం లేదు. కందెన వోలులో (కర్నూలులో) బండికి కందెన పెట్టి చూచినా నడవ లేదు. కారణం ఒక్కటే. పాతకాలపు కర్నూలు నవాబుల ప్రభుత్వకాలం కాదు ఇది. ప్రజాస్వామ్య ప్రభుత్వకాలం ఇది. ప్రభుత్వ రథాన్ని పురుష పుంగవులు యీడ్చే కాలం కాదిది. ఇది ఎద్దులు (పుంగవములు) యీడ్చేకాలం కాదు. ప్రజాబలంతో ఎలెక్టరలు రోల్ అనే పెట్రోల్ బలంతో నడిచే మోటారు కారువంటిది యీనాటి ప్రభుత్వ శకటం.

అందుకనే ఆంధ్ర ప్రభుత్వవర్గం రాజీనామా యివ్వవలసివచ్చింది. పెట్రోల్ లేని కారువలె, విశ్వాసం లేని మంత్రివర్గం అయింది. అయితేనేం? పెట్రోల్ ఎక్కించాలి. ప్రజల ఎలెక్టరలురోలు బలంతో మరొక మంత్రివర్గం ఏర్పడితే, తిరిగి యీ శకటం చకచకా నడుస్తుంది.

మొత్తంమీద, కాంగ్రెసుపార్టీవారి బలం కట్టుదిట్టం కావాలి. కాంగ్రెసుపార్టీ వారందరూ గాంధీ ఉపాసన గట్టిగా చెయ్యాలి. ఆయన యతిరాజు. ఈ ప్రభుత్వాధిపత్యం నిలువవలెనని కోరే ప్రభుత్వాధికారకాములందరూ ఆ యతిరాజును, ఆ గాంధి మహర్షిని ఉపాసన చెయ్యాలి. యతిని నృపతి తిరస్కరించితే, అతని ప్రభుత్వ శకట చక్రం నడవదు.

రాజుకు ఉండే ప్రభావం అంతా యతిరాజుల ఆశీర్వదన ప్రభావం అని గ్రహించాలి. మహాత్ములను తిరస్కరిస్తే, మహారాజులు మహామాత్యులు, "హుమ్! మహాకాళి!" అన్నట్లుగా అంతర్ధానమవుతారు. మహాత్ములతో మనకు పనిలేదనే యెడల, వారి అనుగ్రహం మనమీద ఉండదు. వారి అనుగ్రహం మనకు లేకపోవడమే మనకు నిగ్రహం. మహాత్ముని మనం లెక్కచేయకపోతే, మనకు దిక్కులేకుండా పోతుంది.

"యనురాగము మాకును లేదు నీయెడన్"

అని వోట్లు ఇచ్చే ప్రజలుకూడా ధిక్కరిస్తారు.

గాంధీమహాత్మకీ జై! ★

# సుగుణ

(11వ పేజీతరువాయి)

సుగుణ. తమ్ముడు చదువుకొంటున్నాడు. పక్కింట్లో గడియారం పన్నెండుకొట్టింది.

"సుధా! ఇంక పండుకోరాదూ?" అన్నది సుగుణ.

"రేపటినుంచీ పరీక్ష లక్కయ్యా."

"అయితే అయిందిలేవోయ్. పన్నెండు గంటలయినా ఇంకా ఏం చదువు? సంవత్సరమంతా చదివింది చాలదూ?" అన్నది సుగుణ.

శేషమ్మ ఖస్సుమంటూ లేచింది. "అఘోరించావులే నోరుమూసుకో. వాడు చదువుకుంటావంటే నీదేం పోయింది?" అని కసిరికొట్టింది. సుగుణ నోరువిప్పక గట్టిగా కళ్ళు మూసుకొని పడుకొంది.

సుగుణ ఎక్కడికో పోతూ ఉంది. ఎటు చూచినా చీకటి. ఎవ్వరూ కనిపించ లేదు. ఎవరో మనిషి, చేతిలో లాంతరుపట్టుకొని వచ్చాడు. సుగుణ ఆశతో ఆ మనిషిని చూచింది.

ఇంకెవరు? మామయ్యే! చంద్రం మామయ్యే!!

"సుగుణా, ఈ చీకట్లో ఇంత దూరం నాకోసం వచ్చావా?" అంటూ వచ్చి, భుజంమీద చేయివేసి దగ్గరికి తీసుకొన్నాడు.

"ఏయ్ కుంటిపిల్లా, పలకవేం?" అని పెదవులు రెండూ పట్టుకొని కదిలించాడు.

"మీ అమ్మా నాన్నా బాగున్నారా? సుధాకరుడు బాగాచదువుకొంటున్నాడా?" అని అడుగుతూనే చేతులు చుట్టూ చుట్టేశాడు. అమ్మో, మామయ్యకి ఎంత బలం ఉంది! "ఇన్నాళ్ళకి నామీద దయ కలిగిందా మామయ్యా!" అని అందామనుకుంది సుగుణ. కానీ పాడు సిగ్గు అడ్డుపడింది.

"సుగుణా, నేను చాలా మంత్రాలు నేర్చుకొచ్చాను. చూస్తూఉండు, నీ కుంటి కాలు ఇప్పుడే బాగు చేసేస్తాను" అని కాళ్ళలో చక్కిలిగింతలు పెట్టి నవ్వించాడు. ఎన్నడూ అనుభవించని ఆ ఆనందంలో సుగుణ తన కుంటికాలు సంగతే మరిచిపోయింది.

ఇంతలో ఎవరో యమకింకరుల్లా వచ్చారు. చేతుల్లో పెద్ద పెద్ద తుపాకులున్నాయి. వాళ్లని చూడగానే మామయ్య లేచి నిల్చున్నాడు. వాళ్ళు తుపాకులు రెండూ చంద్రం గుండెకు గురిపెట్టారు.

"అయ్యా, మా మామయ్యను ఏమీ చెయ్యకండయ్యా, మీ పాదాలు పట్టుకొంటాను" అని సుగుణ గొల్లున ఏడుస్తూ వాళ్ళ కాళ్లు పట్టుకొంది. కాని వాళ్ళు సుగుణను కాళ్లతో తన్నేసి, రెండు తుపాకులూ వక్కసారి పేల్చారు. చంద్రంహృదయంలోనుంచి తుపాకిగుండ్లు దూసుకొనిపోయాయి. నేల కొరిగిపోయాడు చంద్రం.

"మామయ్యా" అంటూ సుగుణ దిక్కులు ప్రతిధ్వనించేలా కేకేసి, చంద్రం శవాన్ని కౌగలించుకొంది.

"ఏమిటమ్మా సుగుణా, ఏమిటమ్మా!" అంటూ అమ్మా నాన్నా, ఇద్దరూ గాభరాగా లేచివచ్చి సుగుణదగ్గర కూర్చున్నారు.

సుగుణ కళ్లు తెరిచి గజగజలాడుతూ, అమ్మనూ, నాన్ననూ, కొత్తగా చూచినట్లు చూచింది.

"ఏమిటి తల్లీ? ఎందుకమ్మా, అంత పెద్దగా కలవరించావెందుకమ్మా?" అని శేషమ్మ కన్నీరు కారుస్తూ గద్గదస్వరంతో అడిగింది.

"ఏమీ లేదమ్మా. ఏదో పాడుకల వచ్చింది." అని సుగుణ ముసుగుపెట్టుకొని పడుకొంది.

[ఇంకా ఉంది]

వీర్యస్తంభన రసాయనం : శుక్రనష్టము మాపి మంచి బలం వీర్యవృద్ధి కల్గించును. డబ్బీ రూ. 5/-

గర్భ నిరోధిని: యిటు మీదట గర్భం రాకుండా ఆపుటకు, లోపలికి సేవించే అతి నమ్మకమైన మందు. రూ. 10/-

నపుంసక తైలం: చిన్నదైన అంగ నరములు, తిర్గి యథాప్రకారమై పూర్తి సౌఖ్యమును రూ. 10/-

పై వాటికి ఖర్చులు రూ. 1-0-0 లు అగును. కావలసినచో ముందు గాపం పేడి.

డాక్టర్ రత్నం సన్స్, మెడికల్ హాల్, మలకపేట బిల్డింగ్స్, హైద్రాబాద్.



పెద్దకథ

# సుగుణ

జి. సి. రామకృష్ణ

## 10

సుధాకర్, స్కూల్ ఫైనల్ పరీక్ష పాసయాడని తెలియంగానే, అందరూ ఆనందంలో తన్మయులైపోయారు శేషమ్మ, చుట్టుపక్కల వాళ్లతో చెప్పి, చెప్పి సంతోషించింది.

"అక్కయ్యా, నీకేం భయంలేదు నేను, మద్రాసు పోయి, సినిమాల్లో చేరి డబ్బు సంపాదించి పారేస్తా బాగా కట్నం ఇచ్చి మంచి చదువుకున్న వాణ్ణి తీసుకొచ్చి నీకు పెళ్ళిచేస్తా నీకేమీ దిగులుపడాల్సిన అవసరమే లేదు" అన్నాడు సుధాకర్ సుగుణ పిచ్చినవ్వు నవ్వింది

పోస్టు జవాను వచ్చి, ఒక జాబు ఇచ్చి వెళ్లాడు సుధాకర్, ఉత్సాహంతో తల ఊపుతూ, జాబు చించి చదివాడు.

"ప్రియమైన బావగారికి చంద్రం నమస్కారములు—మీరందరు క్షేమంగా ఉన్నారని నమ్ముతున్నాను నన్ను రెండు నెలల క్రిందట అరెస్టుచేసి జైల్లో పెట్టారు. పార్టీరహస్యాలు చెప్పమని, నాయకు లెక్కడున్నారో చెప్పమని చాలా బాధలు పెట్టారు లాఠీలతో ఒళ్లంతా కుళ్లబొడిచారు గోళ్లలో గుండుసూదులు దిగగొట్టారు అన్నీ సహించాను ఫలితం శరీరం నాశనం అయిపోయింది గుండె, ఊపిరితిత్తులు, పూర్తిగా చెడిపోయాయి ఇక నేనెందుకూ పనికిరానని తెలుసుకొని వదలిపెటారు కొంతమంది స్నేహితుల సహాయంతో మదనపల్లి ఆస్పత్రికి చేరాను మీరు నాకోసం దిగులుపడాల్సిన అవసరం ఏమీలేదు - బావా, సుగుణకు పెళ్ళి చేశావా? ఇంకా లేదా? మీరు ఆమె పెళ్లి సంగతి ఎప్పుడూ నాదగ్గర హెచ్చరించనే లేదు కానీ నాకుమాత్రం ఆమెను పెళ్ళి చేసుకోవాలనే దురాశ మనసులో ఉండేది అక్కయ్యగూడా నన్ను ఆ సంగతి అడగనేలేదు పోనీలే, వాళ్లకి ఇష్టంలేదు కామాలు, అనుకున్నాను జరిగిపోయిన దానికి నేనేమీ చింతించటంలేదు. ఎందుకంటే, నన్ను పెళ్ళిచేసుకొని ఆమె సుఖపడేది ఏమీ ఉండదని నాకు బాగా తెలుసు అందువల్లే నేనుకూడా ఆ సంగతి మీతో అనలేదు.

"సుధాకరుణ్ణి ఏదైనా ఉద్యోగంలో చేర్పించు అనవసరంగా డబ్బు [illegible]ట్టి చదివించటమే తప్ప, ఏమీ లాభం [illegible].

"వెంటనే జాబురాయి అక్కనూ, సుగుణనూ, అడిగానని చెప్పండి.—

మీ, చంద్రం."

సుగుణ చెరగులో ముఖం దాచుకొని గిజగిజలాడుతూ దిక్కులేని పక్షిలాగా విలపించింది. సుధాకర్ దుఃఖాన్ని దిగమ్రింగటానికోసం పెదవులు పంటితో కొరుక్కుంటూ, గుటకలు వేస్తూ తల్లిదగ్గరికి వెళ్లి మళ్ళీ ఒకసారి జాబు చదివి వినిపించాడు

సుధాకర్ జాబు చదువుతూంటే, ఒక్కొక్క మాట ఒక్కొక్క బాణంలాగా తగిలి, శేషమ్మ దుఃఖంతో క్రుంగిపోయింది

రాఘవయ్యగారు ఆఫీసునుంచి ఇంటికొచ్చి, జాబు చూచి, ఒకమూల కళ్ళు తుడుచుకొని, శూన్యంలోకి చూస్తూ కూచున్నాడు.

చంద్రం "బావా, బావా" అని వినయంతో మాట్లాడుతూంటే, ఆ రెండు

# ★ సుగుణ ★

అక్షరాల్లో, ఏదో అర్థంకాని అపారమైన అనురాగం, ఉట్టిపడుతూండేది. ఇంతా చూస్తే, చంద్రం, రాఘవయ్యభార్యకు, తమ్ముడు. కానీ బావమరదుల మధ్య, ఇద్దరికీ తెలియకుండానే అపారమైన ప్రేమ గౌరవాలు ఏర్పడ్డాయి. ఎంత అణచుకొన్నా రాఘవయ్యకు ఆవేదన అణగలేదు.

"వద్దురా నీకీ రాజకీయాలు, అని నేను నెత్తిన నోరుపెట్టుకొని కొట్టుకున్నాను. వాడేమైనా విన్నాడా? కాంగ్రెసులో చేరి సత్యాగ్రహాలుచేసి, జైళ్ళలో మగ్గిపోయాడు. స్వరాజ్యం వచ్చింది గదా, ఊరుకోగూడదూ? మళ్లీ కమ్యూనిస్టు పార్టీలో చేరడం ఎందుకు? గవర్నమెంటుతో జగడం పెట్టుకోవడం ఎందుకు? అఖరికి వాడి సంగతి అనుకొనేవాళ్లు ఒక్కరైనా ఉన్నారా? వాడి జీవితం అగచాట్ల జీవితం అయిపోయింది" అని చెమ్మగిలిన కళ్ళను రాఘవయ్య తుడుచుకొన్నాడు. వెంటనే జాబు రాశాడు. డబ్బుకు చాలా యిబ్బందిగా ఉందనీ, పదిరోజుల్లో మదనపల్లి వస్తాననీ రాశాడు.

చంద్రం మామయ్య రాసిన జాబు సుగుణ భద్రంగా దాచిపెట్టుకుంది. సుధాకరుడిచేత ఒక కవరు తెప్పించుకొని జాబు వ్రాయడానికి కూచుంది.

"ప్రియమైన మామగారికి సుగుణ నమస్కారములు. మామయ్యా, నీ జాబు చూచి నేనెంతో సంతోషించాను. నీకు నామీద నిజంగా ఇష్టం ఉంటే, నాతో ఎందుకు చెప్పకూడదు? ఎందుకు మామయ్యా ఈ దొంగ మాటలు? నాకు తెలుసులే ఈ కుంటిదాన్ని చూస్తే, నీకు ప్రేమ ఎలా కలుగుతుంది చెప్పు?

"నేను నీమీద ఎన్నో ఆశలు పెట్టుకున్నాను. నాకు పెళ్ళి చేయలేక, అమ్మా, నాన్నా అష్టకష్టాలు పడుతుంటే, నీవు ఏమీ పట్టనట్లు తిరిగావు. ఇంటికి రావటం కూడా మానేశావు. పెద్దవాడివయితే అయ్యావు. నన్ను పెళ్ళిచేసుకొని, మా అమ్మకూ నాన్నకూ బరువు తొలగిస్తావు గదా అనుకొన్నాను. కాని నీవు నా మాటే తల్చుకోలేదు. నీఅంత కఠిన హృదయుడు లోకంలో ఇంకెవరైనా ఉంటాడా? నీవు మాత్రం, బాగుపడిం దేముంది? దేశాన్ని ఉద్ధరించాలని చదువు ముగించుకొని జైళ్లకు పోయి మగ్గిపోయావు. స్వరాజ్యం వచ్చిన తర్వాత ఊరుకోకుండా అందరి కష్టాలూ పోగొడతానని బడాయిలుకొట్టి, అవస్థల పాలయ్యావు. నేను నిన్ను దేవుడితో సమానంగా నాహృదయంలో ఆరాధించుకొన్నాను. ఒక ఆడదానిమనసు అర్థం చేసుకోలేనిమగవాడు మనిషేనా? ఒక అమాయకురాల్ని అన్యాయం చేస్తే దేవుడు మాత్రం ఊరుకుంటాడా? నాకూ ఈ లోకంలో బతకాలని ఆశలేదు. నీవు మళ్ళీ జాబు రాయవద్దు.

నీ సుగుణ."

పమిట చెరగుతో కన్నీరు తుడుచుకొని, బుసలు కొడుతూ, అమ్మ చూస్తుందేమోనని జాబు గబగబా మడిచి, కవరులో పెట్టి సుధాకరుడిచేతికిచ్చి పోస్టులో వేసి రమ్మంది.

సుధాకర్ కవరుపైన అడ్రసుచూచి ఆశ్చర్యపడి, పోస్టాఫీసుకుపోయి, జాబు జాగ్రత్తగా తీసి చదివి, విచారంతో మళ్ళీ జాబు కవరులో పెట్టి, అంటించాడు. జాబు పోస్టులో వేస్తామా, వద్దా అని అలాగే నిల్చొని చాలాసేపు ఆలోచించాడు. చివరికి అక్కయ్యను మోసం చెయ్యడం ఇష్టం లేక, జాబు తపాలుపెట్టెలో పడేశాడు. కాని ఇంటికి తిరిగి వస్తుంటే, "జాబు పోస్టులో వెయ్యకుండా ఉంటేనే బాగుండేదే" అనిపించిం దతనికి. జాబు చదివి మామయ్య ఎంత కష్టపడతాడో; అసలే ఇంతకుముందు రాసినజాబు చాలా దిగులుతో రాశాడు; అని సుధాకర్ ఆలోచిస్తూ ఇంటికి చేరి, మనసు ఉండబట్టక, అమ్మ దగ్గరికివెళ్లి "అమ్మా, అక్కయ్య చంద్రం మామయ్యకు జాబు రాసింది" అని గుసగుస చెప్పాడు. శేషమ్మ అదిరిపడి "ఏమని రాసింది" అని ఆసక్తితో అడిగింది.

"మామయ్యా, నీవు వట్టి దుర్మార్గుడివి. నన్ను పెళ్ళిచేసుకోలేదు. కాబట్టే నీకు దేవుడు తగిన శిక్ష వేశాడు." అని ఏమేమో కోపంగా రాసేసింది" అన్నాడు సుధాకర్. శేషమ్మకు ఒళ్లు జల్లుమంది. కొంతసేపు కళ్లు చీకట్లు కమ్మాయి. ఆమె జాగ్రదవస్థలోకి వచ్చాక సుగుణదగ్గరికి వచ్చి, "ఏమిటే సుగుణా! వాడొక పక్క జబ్బుతో బాధపడడమేమిటి? నీవు చివాట్లు పెడుతూ జాబు రాయడం ఏమిటి?" అని జాలిగా అడిగింది. సుగుణ మూగదానిలా కూచుంది.

సుగుణ జాబు రాసినసంగతి రాఘవయ్యగారికికూడా కొన్నాళ్లకు తెలిసింది.

"ఇన్నాళ్లు దానిమనసు గ్రహించలేకపోయాను. చంద్రం చాలా పెద్దవాడు గదా, వాడికి ఈ పెక్కడవుతుంది, అనుకున్నాను. అదీగాక వాడు స్థిమితంగా ఉంటేగా! జైళ్లకు పోనూ రానూ సరిపోయింది వాడి జీవితం కాస్తా. ఏంచేసేది తల్లీ! ఈ దరిద్రుడి కడుపునపుట్టి మీ రిన్ని బాధలు పడాల్సొచ్చింది" అని గద్గద స్వరంతో అన్నాడు. వకీలుగారిదగ్గరకు వెళ్లి, కాళ్లా వేళ్లా పడి, యాభైరూపాయలు బదులు తీసుకొని మరునాడే మదనపల్లి ప్రయాణమై వెళ్లాడు.

## 11

నాన్న తిరిగి ఎప్పుడొస్తాడా అని కళ్లు కాయలు కాచేట్లు చూస్తూ


బహిష్టు ఆగినదా?




ఎంతకాలంనుంచి ఏ కారణంవల్ల నిలిచిపోయిన బహిష్టు నైనను దేవీపిల్సు తిరిగి అపాయంలేకుండ [illegible]. ఇండియా గవర్నమెంటు (వి డి ఎల్/688) [illegible] డ్రగ్సు లెబొరేటరీ క్రింద రిజిస్టరుచేయబడినది. ఇది గ్యారంటీ ఔషధము. అనేక యోగ్యతా పత్రములు కలవు. నకిలీ మందులు వాడి మోసపోవద్దు. సాధారణ కేసులకు ఖరీదు రు. 8-8-0. వెలయూ నిలిచిపోయిన కేసులకు రు. 10-8-0. వి. పి. పి. ప్రత్యేకం.

సంతాన నిగ్రహం




స్పెక్ పిల్సు రిజిస్టర్డు నెం. 266. గ్యారంటీ ఔషధము. 12 రోజులు సేవించిన 6 సంవత్సరాల వరకు శాశ్వతంగా గర్భము కలుగదు. మామూలుగా బహిష్టుకు భంగం కలిగించదు. ఇతర నకిలీ మందులు వాడి మోసపోవద్దు. అనేక యోగ్యతాపత్రములుకలవు. ఖరీదు రు. 12/-లు. వి.పి.పి. వేరు.

SEENU & Co., P. B. No. 1638 ( J ) Madras-1.

బ్రాంచీలు: సింగపూరు, కౌలాలంపూర్. (ఏజంట్సు: సిలోన్, [illegible].
ప్రాతినిధ్యంలేని తావులలో ఏజంట్లు కావలెను.)

కూచుంది సుగుణ. రెండురోజులకి నాన్న తిరిగివచ్చాడు. ప్రయాణపు బడలిక వల్ల పిచ్చివాడుగా మారిపోయాడు నాన్న. రాఘవయ్య ఇంట్లోకి రాగానే, అందరూ ఆత్రుతతో ఎదురుగా వచ్చి నిలబడ్డారు. సుధాకర్ అందరికంటె ముందుకి వచ్చి "మామయ్య ఎలా ఉన్నాడు నాన్నా? అక్కయ్య రాసినజాబు చదువుకొని ఏమన్నాడు?" అని అడిగాడు. రాఘవయ్యగారు కుక్కిమంచంలో కూలబడ్డాడు. సుధాకర్ కళ్లల్లోకి పిచ్చిగా చూస్తూ వాడిని దగ్గరికి తీసుకొన్నాడు. "ఏమిటండీ?" అని శేషమ్మ గిజగిజ లాడుతూ అడిగింది.

"ఏముంది? అన్నీ అయిపోయాయి. వాణ్ణి చూచే ప్రాప్తికూడా లేకుండా పోయింది." అని కన్నీరు పంచెతో తుడుచుకొన్నాడు.

ఒక్క క్షణంలో ఆ యిల్లు ఒక దుఃఖ సాగరంలో మునిగిపోయింది.

రాఘవయ్య దుఃఖాన్ని కొంతసేపు ఆపుకొని, చేబులోంచి ఒక కాగితంతీసి,

"ప్రాణంపోయిన తర్వాత చూస్తే, ఈ జాబు వాడి గుండెలపైన ఉందట" అని కిందపడేశాడు. అది సుగుణ చంద్రానికి రాసిన జాబు.

సుగుణ ఒక్కసారి తలెత్తి ఆ కాగితం చేతిలోకి తీసుకొని వలవలఏడుస్తూ తల వంచుకొని, తనను భూమిలోకి తీసుకొని పొమ్మని భూదేవిని ప్రార్థిస్తున్నట్లుగా తల నేలకేసి కొట్టుకొంది.

శేషమ్మ తటాలున కూతురి తల పట్టుకొని కౌగలించుకొని, దిక్కులేని దానిలాగా గిజగిజలాడిపోయింది

ఇల్లంతా జనంతో నిండిపోయింది. పక్కింటివాళ్లూ, రాఘవయ్య స్నేహితులూ, వచ్చి విచారించి, ఓదార్చి వెళ్ళిపోయారు...

"అయ్యో పాపం!" అన్నారు కొందరు.

"ఆ బడుద్దాయి కమ్యూనిస్టుపార్టీలో చేరి విచ్చలవిడిగా తిరిగి అరెస్టయాడు. చావగొట్టి చెవులు మూసి జైల్లో వేశారు. జబ్బుచేసి చచ్చిపోయాడు" అని ఇంట్లో నుంచి బయటికొచ్చి కొంతమంది మర్యాదస్థులు అనుకొన్నారు.

## 12

చంద్రం ఈ లోకంనించి, నిష్క్రమించాడని అక్కగారికి బెజవాడకు జాబు రాశాడు రాఘవయ్య.

రంగమ్మ వచ్చి అందరి ముఖాలు చూచి, "అయ్యో, ఇలా అయిపోయారేమే?" అని విచారించింది. అందరినీ ఓదార్చడానికి ప్రయత్నించింది. ఓదార్చేవాళ్లుంటే దుఃఖం గట్లుతెగిపొంగుతుంది. ఓదార్చే వాళ్లు లేకపోతే మనిషి మనోవ్యథతో కృశించిపోతాడు. దుఃఖం మానవులకు శత్రువు.

"చిన్నప్పుడే తల్లీ, తండ్రీ చచ్చారు. ఇక అడిగేవాళ్లెవరూ లేరని యిష్టం వచ్చినట్లు తిరిగాడు. బతికినన్నాళ్లు, జైళ్ళలో అవస్థలుపడి, అన్యాయం అయిపోయాడు. ఆఖరుకు వంశం నిలబెట్టే దిక్కు లేకుండా చేసిపోయాడు" అని శేషమ్మ ఆక్రోశించింది.

"సుగుణ రాసిన జాబు వాడి చేతుల్లో ఉందట" అని నాన్న పలికినమాట, సుగుణ హృదయంలో శాశ్వతమైన గాయమై నిల్చిపోయింది.

"జాబు చదువుకొని ఏమనుకొన్నాడో, ఎంత బాధపడ్డాడో. పాపిష్టిదాన్ని కోపం అంతా వెళ్లబోస్తూ ఏమేమో రాశాను. ఆజాబు చదివి, ఆవేదన భరించలేక మామయ్యకు గుండె ఆగిపోయి ఉంటుంది. చేతులారా మామయ్యను నేనే చంపుకున్నాను" అనుకుంటూ సుగుణ కుంగిపోయేది.

రాఘవయ్య నిద్రలేచిందిమొదలు, పొట్టకోసం తంటాలుపడుతూ క్రుంగిపోతున్నాడు. తమ్ముడు పోయినప్పటినుండి, శేషమ్మ మనసు రాయైపోయింది. ఆమె సుగుణను, నిర్దాక్షిణ్యంగా చూడడం ప్రారంభించింది.

కొంతమంది తల్లిదండ్రులకు తమ బిడ్డల మనోవ్యథను గ్రహించే సామర్థ్యంవుండదు. నిత్యదారిద్ర్యంతో బాధపడేవాళ్లు దినమొక యుగంగా గడుపుతుంటారే గానీ, తమ కడుపున పుట్టిన బిడ్డల హృదయాల్లో ఎంత సంఘర్షణ జరిగేదీ తెలుసుకోలేరు.

ఒకనాడు రంగమ్మ సుగుణను దగ్గర కూచోబెట్టుకొని జడవేస్తూ అంది. "పిచ్చిపిల్లా; చిన్నప్పుడు చదువుకోవే, చదువుకోవే అని ఎన్నిసార్లు చెప్పాను? నీవేమైనా విన్నావా? బెజవాడలో మొన్న ఆసుపత్రికి పోతే ఒక నర్సు ముచ్చటగా అలంకరించుకొని అటూ ఇటూ కులుకుతూ తిరుగుతూ ఉంది. నీవు జ్ఞాపకానికొచ్చావు. లక్షణంగా ఏదో థర్డుఫారందాకా నన్నా చదువుకోనుంటే, ట్రైనింగు చదివినా ఎంత బాగుండేది? నా మాట ఎవరికి పట్టిందమ్మా?" రంగమ్మ సుగుణను ఓదారుస్తున్నట్లు, జరిగిపోయినదానికి పశ్చాత్తాప పడుతున్నట్లూ మాట్లాడింది.

ఇంతలో సుగుణ బాల్యస్నేహితురాలైన సరోజని గుమ్మడిపండులాంటి ఒక బిడ్డను చంకనెత్తుకొని వచ్చింది. అందరూ ఆశ్చర్యంగా చూచారు.

"ఏమండీ, రంగమ్మగారూ ఎప్పుడు రావడం?" అంది సరోజ.

"నాకు మొన్ననే ఇక్కడికి ట్రాన్స్‌ఫర్ అయిందమ్మా. ఇంక ఎప్పుడొస్తుందో వస్తుంది మళ్ళీ, అరెస్టువారంటు వస్తుంది, బెజవాడ రమ్మని" అని రంగమ్మ చమత్కారంగా జవాబు చెప్పింది.

సరోజనికి ఏమీ అర్థంకాలేదు. "ఏమైనా ఉద్యోగంలో చేరారా ఏమిటి?" అంది. "ఆ. నా ఉద్యోగంలాంటి ఉద్యోగం ఇంకెవరికైనా దొరుకుతుందా? అందరికీ పురుళ్లు పోయడం, వంటచేయడం; ఎక్కడికి ట్రాన్స్‌ఫర్ చేస్తే అక్కడికల్లా వెళ్ళడం; అమ్మో నా ఉద్యోగంలాంటి ఉద్యోగం, మీకెవరికైనా దొరుకుతుందా?" అని రంగమ్మ వెటకారంగా నవ్వింది. సరోజని కిలకిలా నవ్వింది. రంగమ్మమాటలు శేషమ్మ మనసులో మంటలు రేపాయి. నోరు తెరవకుండా గుట్టుగా కూచుంది

సుగుణలేని సంతోషాన్ని తెచ్చుకుంటూ, సరోజని చంకలో ఉన్న పసిబిడ్డను ఎత్తుకొని ముద్దాడింది. పసిబిడ్డ స్పర్శ ఆమె హృదయంలో చక్కిలిగింతలు పెట్టింది. శరీరం గగుర్పొడిచింది.

"అబ్బా, పీడితో వేగలేకుండా ఉన్నానమ్మా; ఎప్పుడూ ఎత్తుకొనే ఉండాలి. వాళ్ళనాన్న ఆఫీసుకు పోయొచ్చి, కొంచెం సేపు ఆడిస్తారేగాని, బిడ్డ ఏడిస్తే ఊరుకోబెట్టడం ఈ మగవాళ్ళకి చేతకాదమ్మా. దానికి మనమే సరి"అని కొంచెంసేపు ఆగి గుక్క తిప్పుకొని, "సరేకానీ, సుగుణా ఏమి ఇంత తగ్గిపోయావు? పిచ్చిదానిలాగా మారిపోయావు? నిజం చెప్తున్నాను సుగుణా, పెళ్లిచేసుకొని సుఖం అనుభవిస్తామనుకోవడం భ్రమ. నేనేం సుఖపడుతున్నానో చూడు. పొద్దస్తమానం ఇంటో చాకిరీతో సరిపోతుంది. ఈ వెధవను సముదాయించుకోవాలి. ఆయనకు ఆఫీసు టైముకు వంటచెయ్యాలి. వచ్చే జీతండబ్బులు పదిహేను రోజులకు గూడా చాలవు" అని గుక్కచాలక సరోజని కొంతసేపు అలుపు తీర్చుకొంది.

సరోజని అసలే మాటలపుట్ట. ఎందువల్లనో, పెళ్లిఅయిన తర్వాత మాటలు ఇంకా జాస్తి అయినాయి.



# "సకలశాస్త్రములు చదివియు..."

చుట్టూ గోదావరి చాలా ప్రశాంతంగా వుంది. ఈ గోదావరేనా అంత భీభత్సం చేసింది. ఇప్పటి తీరు చూస్తే ఆమాట నమ్మశక్యంగా లేదు. దూరంగా కొవ్వూరు తీరం సంజె వెలుగులో క్రీనీడలా కనబడుతోంది. శర్మ ఆకాశం కేసి చూస్తూ, ఏదో ఆలోచిస్తూ కూర్చున్నాడు.

ఆర్ట్సుకాలేజిలో ఇంటరులోనూ, బి. యస్ సి. లోనూ కూడా నాకు సహాధ్యాయి. అతనికీ, నాకు, కొద్ది తేడాతో చాలా సామ్యం వుండేది. క్లాసులో అన్నిటిలోనూ మొదటివాడతను. అన్నిట్లోనూ వెనకనుండి మొదటివాడిని నేను. గేమ్సులో, ఎలక్యూషన్లో, అన్నిటిలోనూ బహుమతులు కొట్టేసేవాడతను. నేను కొట్టేసేవాడినేమో కాని, వొక్కదాంట్లోనూ పాల్గొనలేదు నేను. అతన్నెరగనివాడు లేడు, నన్నెరుగున్నవాడు లేడు. మరి మాయిద్దరికీ పొత్తెలా కలిసిందో చెప్పడం కష్టం. అన్నిటిలోనూ మొదటి మార్కులెలా సంపాదించగలుగుతున్నాడా అని అతనిగురించి నే ననుకుంటే, అన్నిట్లోనూ అఖరిస్థానమతనెలా మేనేజ్ చేయగలుగుతున్నాడా అని నాగురించి అతననుకునేవాడుట. బహుశః వొకళ్లపై ఇంకొకళ్లకున్న ఈ క్యూరియాసిటీయే మా స్నేహానికి మూలం కావచ్చు. అతనికీ నాకు ఒక్క విషయంలో మాత్రం ఏకీభావం వుండేది. ఇద్దరమూ కూడా భవిష్యత్తునిగూర్చి కలలు కంటూండేవాళ్ళం. చివరకి అనుకున్నట్లే బి. యస్ సి. లో అతను యూనివర్సిటీ ఫస్టు, నేను థర్డుక్లాసుతో యూనివర్సిటీ లాస్టుగా కాలేజిలోంచి బయటపడ్డాం. అతనా డిగ్రీ, గోల్డుమెడలే కాక, కాలేజిలో ఎన్నో బహుమతులు సంపాదించి, కట్టిన కాలేజి ఫీజు వస్తురూపంగా కూడా గిట్టించుకున్నాడు. ఇంక నేను - సరే ఆ విషయం దేనికి? - అతను ఇంజనీరింగులో చేరడమెరుగుదును. ఆ తరువాత అతని విషయాలు తెలియలేదు. నా థర్డుక్లాసు డిగ్రీ ఆంధ్రలో ఎలాగూ చెలామణీ కాదని తెలుసు కాబట్టి, అది పుచ్చుకుని బొంబాయి పోయాను. అప్పటికింకా బొంబాయిలో కొద్దో గొప్పో ఉద్యోగాలున్నాయి కాబట్టి, నా డిగ్రీతో అక్కడ లక్షలాది జనప్రవాహంలో కలిసిపోయాను. తరువాత, కిటకిటలాడే ఎలక్ట్రిక్ రైళ్ళూ, బస్సులూ, క్యూలూ

## సుగుణ

"సరేగాని, మీ చంద్రం మామయ్య పోయాడని ఎవరో అన్నారమ్మా" అని సరోజని, సుగుణ కళ్ళల్లోకి సానుభూతితో చూచింది.

సుగుణ మనసులో అదిమిపెట్టుకొన్న దుఃఖం అగ్నిపర్వతంలాగా ఒక్కసారి పొంగింది. బిడ్డను సరోజని చేతి కిచ్చి, ముఖానికి గుడ్డ అడ్డంపెట్టుకొని సుగుణ క్రుంగిపోయింది.

సరోజని కొంతసేపు ఓదార్చి యింటికి వెళ్లింది. (ఇంకా వుంది)

## ప్రకాశరావు

తప్ప వేరేమీ మార్పు లేకుండా జీవితం గడిచిపోయింది. అందుచేత ఎవరి విషయాలూ నాకంత తెలియలేదు. అంతకాలానికిప్పుడు శెలవుమీద రాజమండ్రి వెళ్లాను. శర్మ వాలకం నా కాశ్చర్యం కలిగించింది. వెనకటి వుత్సాహం లేదు మనిషిలో. మాతో మామూలుగానే చమత్కారంగా మాట్లాడతాడు, నవ్వుతాడు. కాని అతని కళ్లు - ఎప్పుడూ శూన్యంలోకి చూస్తూవుంటాయి. వాటిని చూస్తే స్పష్టమవుతుంది, అతని నవ్వులాటలూ, చమత్కారాలు, కేవలం పైకి మాత్రమేనని. బహుశః మనిషిలో మనిషంటే ఇదేనేమో. శర్మ లోపలి మనిషి ఎప్పుడూ దేనినో అన్వేషిస్తున్నట్లే కనబడతాడు. కాలేజి రోజులలో, ఇతని మనిషిలోని మనిషిని చూసిన గుర్తు లేదు నాకు.

ఇక్కడే లాంచిటాపుమీద, నే నెరుగున్న శర్మని కాదు, నే చూస్తూంట, కొత్త వ్యక్తి, అతని మనిషిలోని మనిషిని. నేను తనని పరీక్షగా చూస్తున్నట్లు కనిపెట్టాడు కాబోలు శర్మ. నాకేసి తిరిగి చిరునవ్వు నవ్వాడు.

"ఏమోయ్, నే నింజనీరింగు మూడేళ్లు చదివి మానేశానని నీకాశ్చర్యంగా వుందేం?

గించింది. మా నాన్నగారికి కోపం కూడా వచ్చింది."

"కోపమా? దానివల్లాయనెంత బాధ పడ్డారో తెలుసా? నీ కేదో మతి చలించిందని ఆయన నిప్పటికీ అనుకుంటున్నారు. అసలు దానికి కారణమనేదేమైనా వుంటే ఆయనకి చెప్పరాదూ?"

"కారణం నాకే తెలియదోయ్ సరిగ్గా. ఒకవేళ నే చెప్పడానికి ప్రయత్నించినా, వాళ్లకది అర్థంకాదు. అందుకనే ఎవరికీ ఆ విషయం చెప్పలేదు. అయినా ఇంజనీరింగ్ పేసయి ఏమిటోయ్ చేయడం?"

"గాడ్! నీకున్న అవకాశాలు నాకుంటే నే నెప్పుడో ఇంజనీర్నయి వుండేవాడిని. పంచవర్ష ప్రణాళికంతా మీదే కదుటోయ్?"

"అమాటే నేనంటూంట. ఇంజనీర్నవుతానోయ్. అయింతర్వాత? జానెడు పొట్ట పోషించుకోడానికి వందలు కావాలా, వేలు కావాలా?

"శర్మా, నువ్వేనా ఆమాటలంటూంట? నిన్నింత మార్చేయగలిగిన బలవత్తర సంఘటనేదో జరిగివుండాలి. అవునా?"

"నిజం చెప్పావ్ ప్రకాశం. నేనా సంఘటన ఎవరికీ చెప్పలేదు. చెబితే అర్థంచేసుకోలేరుకూడాను. కాని నీకు నాసంగతి బాగా తెలుసు. పైగా కొంతదేశం చూసివచ్చినవాడివి. ఇంజనీరింగు కళాశాలలోవుండగా విమానప్రమాదంలో నేను చిక్కుకున్నానని నీకు తెలుసా?"

"అవును మీ నాన్నగారావిషయం చెప్పారు. కాని దానికీ, దీనికి సంబంధం వుందని ఆయన అనుకోలేదు. ఆ ప్రమాదమసలెలా జరిగింది?"

అతను తనకథ ప్రారంభించాడు. గోదావరిలో చిన్నచిన్న అలలు లేవడం మొదలుపెట్టాయి. మేం కూర్చున్న లాంచి ఇటూ, అటూ వూగుతోంది.

* * *

ఇంజనీరింగు మూడవ సంవత్సరంలో వుండగా నేను మద్రాసునుండి ఢిల్లీ విమానంలో వెళ్లడం సంభవించినది. ఆ విమానంలోని కోపైలట్ నాకు పరిచితుడు. నేను ఇంజనీరింగు విద్యార్థిని కావడంతో, క్యూరియాసిటీవల్ల కాక్‌పిట్‌లోకి వెళ్లాను. కేప్టెన్ చాలా హుషారయిన వ్యక్తి. ఎన్నో చమ



పెద్దకథ

# సుగుణ

జి. సి. రామకృష్ణ

## 13

అది ఒక సాయంత్రం. అంధకారం సూర్యుణ్ణి కౌగిలించుకోవాలని తరుముకుంటూ వెళ్తూఉంది. సూర్యుడు చిక్కకుండా నిష్క్రమిస్తున్నాడు.

దేవాలయంలోని గంటల ఓంకారనాదం ఆకాశంలో వ్యాపిస్తున్నది. పెన్నానది వరదలతో పొంగి రంగనాయకస్వామి పాదాలు తాకాలని ప్రయత్నిస్తూ, తన కోరిక తీర్చుకోలేక, దేవాలయ ప్రాకారాలను ఒరుసుకుంటూ హోరుమని ధ్వనిచేస్తూ ప్రవహిస్తూ ఉంది.

దేవాలయ గోపుర శిఖరాలు, "మళ్ళీ రేపు వస్తావుకదూ?" అని చిరునవ్వులతో సూర్యుణ్ణి అడుగుతున్నట్లు, తళతళ మెరుస్తున్నాయి. ఆ దేవాలయ గోపురం, ఎందరు మానవులు, శిల్పులు, కళాకారులు, చెమటోడ్చి నిర్మించారోకాని, అది మానవుడు ఆకాశానికి చేరాలని చేసిన ప్రయత్నానికి చిహ్నంలాగా ఉంది. ఆ గోపురశిఖరాలు, ఆకాశానికి చాలా దగ్గరలోనే ఉన్నట్లున్నాయి.

ఒకరి కౌగిలిలో ఒకరు మురిసిపోతూ లీనమైపోయే ప్రేమికులలాగా, దేవాలయంలో గంటల గణగణధ్వని పెన్నానది ప్రవాహధ్వనితో కలిసి, ఏదో అనిర్వచనీయమైన ఆవేశాన్నీ, ఉద్రేకాన్నీ, కలిగించే సంగీతంలా వినిపిస్తూఉంది.

సుగుణ ఆ ధ్వనివింటూ వాకిట్లో, కూచుంది. ఆమె మనసులో ఇంక ఏ ఆలోచనలూ కోరికలూ లేవు. అలా ఎంతసేపు కూచుందో ఆమెకు జ్ఞాపకంలేదు. సుధాకర్ వచ్చి ఏమిటో చెప్పి వెళ్ళిపోయాడు. "సరేలే" అనిమాత్రం జవాబిచ్చింది.

"కడపట్లో కూర్చుని అఘోరించడం ఎందుకు? భోజనాలకు రారాదూ?" అని ఎక్కసంగా పిలిచింది అమ్మ.

"నాకు ఆకలికాలేదు" అని సుగుణ విసుగుతో జవాబిచ్చింది.

"ఏం? ఆక లెందుకాదు? లేచిరా" అని తల్లి ఆజ్ఞాపించింది.

"రావమ్మా. వాడు తర్వాత తింటాడులే. ఆ కుంక ఎప్పటికొస్తాడో వీధులన్నీ తిరిగి" అని రంగమ్మకూడా పిలిచింది.

విధిలేక సుగుణ అన్నం ముందు కూచొని నాలుగు మెతుకులు తిని కళ్లు మూసుకొని పడుకొంది.

తర్వాత ఏమి జరిగిందో ఏమో, ఛటా, ఫటా దెబ్బల చప్పుడు వినిపించి సుగుణ గాభరాపడి కళ్ళు తెరిచి చూచింది.

"ఎక్కడికి పోయావు ఇంతసేపూ?" అని నాన్న సుధాకరుణ్ణి చావగొడుతున్నాడు. రంగమ్మ, శేషమ్మ, రాఘవయ్యను బ్రతిమాలుకొని అడ్డంతీశారు.

"అక్కయ్యతో చెప్పి పోయానునాన్నా" అని సుధాకర్ వెక్కిళ్లు పెడుతూ ఏడుస్తూ అన్నాడు. సుగుణ గుండె జల్లుమంది.

శేషమ్మకు ఒళ్లు మండిపోయింది.

"ఓసి, దయ్యమా, గుడ్లు మిటకరించుకొని చూస్తున్నావుగదే. ఏమని చెప్పి పోయాడు వాడు నీతో?" అని తల్లి సుగుణను గద్దించి అడిగింది.

"నాకు జ్ఞాపకం లేదమ్మా" అని సుగుణ గజగజలాడుతూ చెప్పింది.

"ఎక్కడికి పోయావ్?" అని రాఘవయ్య మళ్ళీ ఒక్క అరుపు అరిచాడు.

"కస్తూరిదేవీ హైస్కూల్లో నాటకం అయితే చూస్తామని పోయాను నాన్నా" అన్నాడు సుధాకర్ ఏడుస్తూ.

రంగమ్మ, శేషమ్మ, సుధాకరుణ్ణి ఎలాగో బ్రతిమాలి, నాలుగుముద్దలు అన్నం తినిపించారు.

ఎంతసేపు కళ్లుమూసుకొని పడుకున్నా సుగుణకు నిద్రపట్టలేదు. మెల్లగా లేచి సుధాకరుడి ప్రక్కన కూచొని తలమీద చేయి వేసింది. రెండు కన్నీటిబొట్లు సుధాకరుడి బుగ్గమీద పడ్డాయి. సుధాకర్ నిద్రలో కూడా ఉండి ఉండి ఎక్కిళ్ళు పెడుతున్నాడు.

కొంతసేపటికి కళ్ళు తెరిచి, సుగుణను చూచి అదిరిపడి లేచికూచున్నాడు. సుగుణ కన్నీరు ఆపుకుంటూ,

"ఇందాక ఎక్కడికి పోయినావు నాయనా?" అని అడిగింది.

"నీవు వాకిట్లో కూచొనిఉంటే, చెప్పి పోయానక్కయ్యా. కస్తూరిదేవీ హైస్కూల్లో యానివర్సరీ అనీ, వెళ్తున్నాననీ చెప్పాను. నీవు సరేలే, అన్నావు."

రాఘవయ్య కళ్లుతెరిచి చూచాడు. అక్కా, తమ్ముడు, ఏదో మాట్లాడుకొంటున్నారు. ఆయన పశ్చాత్తాపంతో కొంత బాధపడి ఇంకొకవైపు తిరిగి పడుకున్నాడు.

"ఏం నాటకం వేశారు?" అంది సుగుణ మెల్లగా.

"చాలా వేశారు. డాన్సులు, నాటకాలూ, అన్నీ. కానీ ఒక్కటి మాత్రం బలేబాగుంది. శివుడు తపస్సు చేసుకుంటూ ఉంటాడు. మన్మథుడు రతీదేవితోకూడా వచ్చి శివుడిపైన బాణాలు వేస్తాడు. శివుడు మూడోకన్ను తెరిచి మన్మథుణ్ణి కాల్చి బూడిద చేసేస్తాడు. "అయ్యో, నా భర్తను బ్రతికించండి" అని రతీదేవి బూడిదలో పడి పొర్లాడుతూ, గుండెలు బాదుకుంటూ ఏడుస్తుంది. అమాయిన దేవతలందరూ ఆమెమొర ఆలకించి, శివుడిదగ్గరికి వచ్చి, "స్వామీ, మన్మథుడు లేకుంటే లోకంలో ఆనందమే ఉండదు. ఆనందం లేకపోతే మనుషులు బ్రతకలేరు. అప్పుడు సృష్టిఅనేది లేకుండా లోకాలన్నీ నాశనం అయిపోతాయి" అని ఈశ్వరుణ్ణి ప్రార్థిస్తారు. ఈశ్వరుడు "నిజమే. నేను చాలా పొరపాటు పడ్డాను. మన్మథుడు శరీరం అనేది లేకుండా, అందరిలోనూ వ్యాపించి ఉంటాడు." అని కరుణిస్తాడు. రతీదేవి ఆనందంతో తన భర్తను బ్రతికించుకుని వెళ్లిపోయింది" అని సుధాకరుడు కథ ముగించాడు.

సుగుణ వణికిపోతూ ఉంది. కళ్ళనిండా నీళ్లొచ్చాయి. గుటకలు వేస్తూ పెదవులు పళ్లతో గట్టిగా కొరుక్కుంటూ ఉంది.

"ఏమిటక్కయ్యా!" అని సుధాకర్ ఆందోళనతో అడిగాడు.

"ఇంక పడుకో నాయనా. పొద్దుపోయింది" అని సుగుణ వెళ్ళి పడుకొంది.

కొంతసేపయినతర్వాత, "సుగుణా!" అని ఎవరో పిలిచారు.

సుగుణ కళ్లు తెరిచి చుట్టూ చూచింది.

సుధాకరుడు యోగిలాగా ధ్యానముద్రలో ఉన్నట్టున్నాడు.

నాన్న, క్రుంగి కృశించిపోయి, లోకాన్ని మరిచి నిద్రపోతున్నాడు.

తల్లి ఎండిపోయిన చెట్టులాగా పడి గాఢ నిద్రలో ఉంది.

తనకు ఈలోకంతో ఏమీ సంబంధం లేనట్లు రంగమ్మ దూరంగా కటిక నేలమీద పడుకొని ఉంది. సుగుణ కళ్లుమూసుకొని మళ్ళీ పడుకొంది. కానీ "సుగుణా!" అని ఎవరో పిలిచారు.

లేచి కూచొని సుగుణ చెవులు గట్టిగా మూసుకుంది. 'గీ' అనేశబ్దం, ఆ శబ్దంలో మళ్ళీ 'సుగుణా' అనే పిలుపు వినిపిస్తున్నాయి. పెన్నానదీ ప్రవాహధ్వని స్పష్టంగా హోరుమని వినిపిస్తూ ఉంది.

సుగుణ అడుగులో అడుగు వేసుకుంటూ రోడ్డుమీదికి వచ్చింది. 'ప్రపంచానికంతా మేమే ప్రతినిధులం' అన్నట్లు కుక్కలు ఒకసారి మొరిగి ఊరుకున్నాయి.

దేవాలయంవైపు నడిచింది సుగుణ. మంటపంనిండా బిచ్చగాళ్ళు పడుకొని ఉన్నారు.

దేవాలయం ఎదుట కొంతసేపు నిల్చొని సుగుణ ఒకసారి తన కుంటికాలు చూచుకొని "భగవంతుడా! నేను నీ కేంద్రోహం చేశాను?" అని అడిగింది. కాని ఈప్రశ్నకు జవాబురాలేదు.

పెన్నానది హోరుమని సంగీతం ఆలపిస్తూ సుగుణను ఆహ్వానించింది.

సుగుణ అప్రయత్నంగా పెన్నానదివైపు మరలింది. గోడకు ఆనుకొని, నిల్చొని, ఒకసారి ప్రవాహాన్ని చూచింది.

నది మధ్యలో ఏదో గలగల చప్పుడవుతూ ఉంది. సుగుణ ఆవైపే చూచింది.

ఎవరో మనిషి ఏటికి ఎదురీదుతున్నాడు.

"అమ్మో ఎంత ధైర్యం!"

చేతులతో నీళ్లని బాదుతూ పోరాడుతున్నాడు. పాపం! ఎవరో ఆ మనిషి?

పిచ్చి సుగుణ ఆమనిషి ఎవరో తెలుసుకోవాలని గిజగిజలాడిపోయింది.

"సుగుణా" అని ఆ ఏటికి ఎదురీదేమనిషి పిలిచాడు. ఆ గొంతు సుగుణకు బాగా పరిచయం. అది మామయ్య గొంతే. చంద్రం మామయ్య గొంతే అది.

"మామయ్యా" అని కేకేసి, సుగుణ చేతులు పైకెత్తింది. గోడమీద ఆనుకున్న కుంటికాలు జారింది. నీళ్ళతో కొంతసేపు పోరాడింది సుగుణ. ఆ నిర్దోషిని తనలో దాచుకోవడం ఇష్టంలేక, పెన్నానదీ జలం ఆమెను రెండు మూడుసార్లు పైకి తోసేసింది.

కానీ, అప్పటికే సుగుణ ప్రాణవాయువులు, నది హోరులో కలిసిపోయాయి.

పెన్నానది దుఃఖాన్ని ఆపుకోలేక హోరుమని ఏడుస్తూ ప్రవహించింది.

## 14

సుగుణ శరీరాన్ని పెన్నానది కన్నీటితో మోసుకొనిపోయి, సముద్రునికి అప్పగించింది. కాని ఆ సంగతి లోకాని కెలా తెలుస్తుంది? సుగుణ ఎవరితోనో లేచిపోయిందన్న వార్త ఇంటింటికీ ప్రాకిపోయింది.

"ఒకమ్మాయి, ఒక మగవానితో లేచి





లల్లూరాం అండ్ కో

(స్థాపితము 1928.)

ఎన్నో సంవత్సరాలుగా మన్నికకును, నాణ్యతకును, సరసమైన ధరలకు ప్రసిద్ధిచెందిన

* ఇనుప పెట్టెలు * ఉక్కుబీరువాలు

* క్యాషు బాక్సులు

లల్లూరాం అండ్ కో

వెలగలేటివారి వీధి, : : విజయవాడ - 1.

"క్రొత్త షోరూమ్ - మారుతి సినిమా కెదురుగా."

## ★ సుగుణ ★

పోయింది" అని తెలిసిందంటే చాలు. కొంతమందికి ఆ వార్తను వ్యాపింపజేయటంలో ఎక్కడలేని ఆసక్తి!

"సుగుణ నిర్దోషి" అని సాక్ష్యం చెప్పడానికి ఎవ్వరూ లేకపోయారు.

రంగనాయకస్వామికి నోరు లేదు. పెన్నానదికి ఏడవడం తప్ప యింకేమీ చేత కాదు.

సుధాకరుడు, రాఘవయ్య, వెతికి వెతికి విసిగిపోయి వచ్చారు.

"లేదమ్మా, ఎక్కడా కనిపించలేదు" అని సుధాకరుడు వెక్కి వెక్కి ఏడుస్తూ తల్లికి చెప్పాడు.

"ఎంతపని చేశావమ్మా" అని, రాఘవయ్య అవమానంతో, దుఃఖంతో కృంగిపోతూ కళ్లనీళ్లు తుడుచుకొన్నాడు.

"నాకు నమ్మకంలేదురా. అది ఎక్కడో, బావిలోనో గుంటలోనో దూకే ఉంటుంది. అది చాలా రోజులనుంచి ఆలోచిస్తూనే ఉంది. నాకు దానిముఖం చూస్తేనే అనిపించింది–" అంది రంగమ్మ.

"అసలు దానికి పరిచయం అయిన మొగవాళ్లు ఎవరున్నారు వదినా? అది మొగాళ్ళతో మాట్లాడాలంటేనే గడగడలాడిపోయేది" అని శేషమ్మ దుఃఖం అపుకోలేక భూదేవిని ఆశ్రయించి వలవల ఏడ్చింది.

కాలం గడిచిపోతూనే ఉంది.

ఇంట్లో ఏ స్థలం చూచినా, అందరికీ సుగుణే జ్ఞాపకానికి వచ్చేది.

"అమ్మా నిన్న నేను పార్కు దగ్గరికి పోతే, అక్కయ్యలాగే, ఒకమ్మాయి కుంటుకుంటూ పోతూఉంది. తలాలున చూచి సుగుణక్కయ్యేమో ననుకున్నాను. దగ్గరికిపోయి చూచాను. ఆ మెవరో, ఒక ముసలాయనతో గూడా నడిచి పోతూ ఉంది." అన్నాడు సుధాకర్.

"ఎందుకు నాయనా, నా కడుపులో చిచ్చు రేపుతావు?" అని శేషమ్మ దుఃఖంలో మునిగిపోయింది.

భారంగా, దీనమొకయుగంగా, రెండేళ్లు గడిచిపోయాయి; శేషమ్మ ఒక ఆడపిల్లను ప్రసవించింది.

"అయ్యో మళీ ఆడపిల్ల పుట్టిందే" అని దంపతు లిద్దరూ కుమిలిపోయ్యారు. శేషమ్మ తన బిడ్డకాళ్లను తడివి చూచుకొని, "మా బంగారుతల్లి కుంటిపిల్ల కాదు." అని సంతోషించింది.

"మన దుఃఖం చూడలేక, దేవుడు, కుంటికాలు బాగుచేసి, మన సుగుణను, మనకే ఇచ్చాడు" అని ఆనందబాష్పాలతో సంతృప్తిపడ్డాడు రాఘవయ్య.

"మళ్ళీ అక్కయ్య నాకు చెల్లెలుగా పుట్టిందా?" అని ఆలోచిస్తూ ఆనందించాడు సుధాకర్.

"ఏమిటే, ఇంత పొద్దెక్కినా బిడ్డకు నీళ్లు పొయ్యకుండా కూచున్నావు?" అని రంగమ్మ, బిడ్డను చేతికి తీసుకొని ఎగరేసి ముద్దులు పెట్టుకుంటూ, "మళ్ళీ మాకు సుగుణమ్మతల్లి పుట్టిందా? దేవుడితో తగవులాడి, కుంటికాలు బాగుచేయించుకొని, మళ్ళీ మా సుగుణమ్మ మాదగ్గరకే వచ్చిందమ్మా" అంటూ రంగమ్మ సుగుణకు నీళ్లుపోయడానికి తీసుకొని పోయింది.

దుర్భరదారిద్ర్యంలో దుఃఖంలో అటుకటించిన ఆ చిన్న గృహంలో ఆనందం ఒక క్షణంసేపు విలాస నృత్యం చేసింది.

(అయిపోయింది)


## కుష్ఠు ★ బొల్లి

వగైరా మేహమచ్చలు, సెగ, సవాయి వ్యాధులకు గ్యారంటీ చికిత్స. క్యాటలాగు ఉచితము: సలహాకు జి. వి. రెడ్డి & కో. (రిజిష్టర్డు)

"భాస్కరాశ్రమము."

గోపాలపురం. తూర్పుగోదావరి.

TP. 538

## ఎంతో రుచికరమైనది, ఎంతో ఆరోగ్యకరమైనది



పకావ్ ఆరోగ్యము నిచ్చును: పకావ్ రుచికరమైనది—మీ భోజన పదార్థములు మంచి వంటకు వాడే సాధనతో తయారుచేయాలనుటకు అనేక కారణాల్లో యివి రెండు. ప్రభుత్వ నిర్ణీతములకు తగినట్టుగా, ఆరోగ్య రక్షక పద్ధతులతో, ఎ.డి విటమినులు కలిపి తయారగు మిక్కిలి శుద్ధత పొందిన పకావ్. పిల్లలకు పెద్దలకు ఎంతో అవసరమైన శక్తిని యిచ్చి వారి ఆరోగ్యమును సంరక్షిస్తుంది; ప్రతి వంటను విందుగా మార్చుతుంది. సరసమైన ధరలకు 2, 10, 36 పౌన్ల డబ్బాలలో దొరకును.

# పకావ్



ఎ.డి విటమిన్లు కలిగినది

తాతా తయారు

A TATA PRODUCT

భారతదేశపు పెట్టుబడితో,

భారత నిర్వహణ క్రింద,

భారతదేశములో తయారవుతున్నది.